నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 14-3-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 196 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో అప్రమత్తం

కార్యక్రమాలను వాయిదా వేసుకున్న గవర్నర్ తమిళసై

రాజ్‌భవన్ వర్గాలు వెల్లడి

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి బారిన పడి దేశంలో ఇద్దరు మృతి చెందిన నేపథ్యంలో అందరూ జాగ్రత్తల్లో పడ్డారు. ఈనేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్ని రాష్ట్ర ప్రభుత్వాలు పాటిస్తున్నాయి. తాజాగా రాజ్‌భవన్ వర్గాలు. కీలక నిర్ణయం తీసుకున్నాయి. గవర్నర్‌కి సంబంధించిన అన్ని కార్యక్రమాల్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించాయి. ఇందుకు ప్రధాన కారణం. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన సలహాయే. ప్రజలు సమూహాలుగా ఉండొద్దని ఆ శాఖ కోరింది. దాన్ని దృష్టిలో పెట్టుకొని రాజ్‌భవన్ వర్గాలు. ఈ నిర్ణయం తీసుకున్నాయి. తిరిగి ఎప్పుడు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో సమావేశాలు మొదలయ్యేదీ ప్రస్తుతానికి చెప్పలేదు. కేంద్రం తీసుకునే నిర్ణయాల ఆధారంగానే రాజ్‌భవన్ వర్గాలు నెక్ట్స్ సమావేశాల తేదీలు నిర్ణయిస్తాయని తెలిసింది.

కరోనాపై ముందస్తు చర్యలు ముమ్మరం

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది
కరోనాపై ప్రజలు ఆందోళన చెందవద్దు
5వేల కోట్లయినా ఖర్చు చేసేందుకు సిద్ధం
కేబినేట్ భేటీలో నిర్ణయాలు తీసుకుంటాం
కేంద్రం పక్కగా చర్యలు తీసుకుంటోంది
అంతర్జాతీయ పరిణామాలు గమనిస్తున్నాం
అసెంబ్లీలో సిఎం కీలక ప్రకటన

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా విజృంభిస్తున్న కరోనా వైరస్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. శాసనసభలో కరోనా వైరస్‌పై సీఎం కేసీఆర్ ప్రకటన చేశారు. ఈ వైరస్ కట్టడికి ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కరోనాపై భయం, ఆందోళన వద్దు. దీన్ని కట్టడి చేసేందుకు అవసరమైతే రూ. 5 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు సీఎం. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలకు సరిపడా మాస్కులు, శానిటైజర్లు, సూట్లు సిద్ధం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశంలో ఇప్పటి వరకు 65 మందికి కరోనా వైరస్ సోకగా ఇందులో 17 మంది విదేశీయులు ఉన్నారని సీఎం తెలిపారు. 65 మందిలో 10 మందిని డిశ్చార్జి చేశారని పేర్కొన్నారు. ఈ వైరస్ వల్ల కేవలం ఇద్దరు మాత్రమే చనిపోయారని కేసీఆర్ పేర్కొన్నారు. గాంధీ ఆస్పత్రిలో చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కూడా కరోనా నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. మరో

ఇద్దరికి కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నాయి. వారి నమూనాలను పుణె ల్యాబ్‌కు పంపామని కేసీఆర్ చెప్పారు. కరోనాను ఎదుర్కొనేందుకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో కరోనా ప్రభావం పెద్దగా లేదని, అయినప్పటికీ తాము అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దని.. కరోనాపై ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. అవసరమైతే రూ.1000 కోట్లు కాదు రూ.5000 కోట్లు ఖర్చు చేసైనా కరోనాను కట్టడి చేస్తామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలకు సరిపడా మాస్కులు, శానిటైజర్లు, సూట్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతంలో కరోనా పాజిటివ్ ఉన్న వ్యక్తి కోలుకున్నాడని.. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశామన్నారు. తెలంగాణలో రెండో కరోనా పాజిటివ్ కేసు నమోదైందని చెప్పారు. ఇటలీ నుంచి వచ్చిన వ్యక్తికి కరోనా పాజిటివ్ అని తేలిందని సభలో కేసీఆర్ తెలిపారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామని, శాంపిల్స్‌ను పుణె ల్యాబ్‌కు పంపామని కేసీఆర్ చెప్పారు. 'కరోనా వైరస్ వ్యాప్తిపై రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి హైలెవల్ కమిటీ చర్చిస్తోంది. ప్రస్తుతం ప్రమాదం లేకున్నా ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. బెంగళూరులో కూడా సంస్థలను మూసేశారు. చాలా రాష్ట్రాలలో థియేటర్లు, స్కూళ్లు బంద్ చేశారు. మేము కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కరోనా కోసం సమన్వయ కమిటీని కూడా ఏర్పాటు చేశాం. డీసీపీ ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన కమిటీని పర్యవేక్షిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో 200 మంది స్క్రీనింగ్ చేస్తున్నారు. హైలెవల్ కమిటీ చర్చించిన అంశాలను రాష్ట్ర మంత్రివర్గం కూడా చర్చిస్తుంది. ఈ సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై ఏ రకమైన చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చిస్తాం' అని కేసీఆర్ అన్నారు. దేశంలో ఇప్పటి వరకు 65 మందికి కరోనా వైరస్ సోకగా ఇందులో 17 మంది విదేశీయులు ఉన్నారని సీఎం తెలిపారు. 65 మందిలో 10 మందిని డిశ్చార్జి చేశారని పేర్కొన్నారు. సాయంత్రం జరిగే కేబినెట్ సమావేశంలో కరోనాపై విస్తృతంగా చర్చిస్తామని చెప్పారు. పాఠశాలల బంద్, తదితర అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చించి సాయంత్రం ప్రకటిస్తామని చెప్పారు. ప్రస్తుతం ప్రమాదం లేకున్నా ముందుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కనుక హైలెవల్ కమిటీ చర్చించిన అంశాలను రాష్ట్ర మంత్రివర్గం కూడా చర్చిస్తుందన్నారు. ఈ సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై ఏ రకమైన చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చిస్తామని సీఎం తెలిపారు. అనంతరం కరోనాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రకటిస్తామన్నారు. ప్రతి వందేళ్లకు ఒకసారి ఈ వైరస్ ప్రపంచాన్ని గడగడలాడిస్తుందన్నారు సీఎం. దాదాపు వందేళ్ల క్రితం ఈ వైరస్ సోకి కోటి 4 లక్షల మంది చనిపోయారని సీఎం గుర్తు చేశారు. ప్రస్తుతం కరోనా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను గమనిస్తున్నామని చెప్పారు. ఈ వైరస్ నియంత్రణకు కేంద్రంతో పాటు ఆయా రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. అన్ని రాష్ట్రాలు చర్యలు తీసుకుంటున్నాయి. పలు రాష్ట్రాల్లో సినిమా హాల్స్, స్కూల్స్ బంద్ చేశారు. పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకుంటున్నారు. దేశంలోని 6 మెట్రో నగరాల్లో హైదరాబాద్ ఒకటి. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రద్దీ బాగా పెరిగింది. హైదరాబాద్ మెట్రోలో ప్రతి రోజు 4 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. హైదరాబాద్‌కు 2013-14లో 88 లక్షలు మంది ప్రయాణికులు వస్తే ప్రస్తుతం 2 కోట్ల 17 లక్షల మంది ప్రయాణికులు వస్తున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 2013-14లో 23 వేల ప్రయాణికులు వస్తే ఇప్పుడు 57 వేల మంది వస్తున్నారు. నాడు 200లకు పైగా విమానాలు వచ్చేవి. ఇప్పుడు 500లకు పైగా విమానాలు వస్తున్నాయి. అంతర్జాతీయ కనెక్టివిటీ పెరిగిందనడానికి ఈ విషయం

చెబుతున్నానని అన్నారు. చైనా, సౌత్ కొరియా, ఇరాన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాల్లో ఈ వ్యాధి అధికంగా ప్రబలింది. దీంతో ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను మన దేశంలోని అనుమతించొద్దని కేంద్రం వీసాలు రద్దు చేసింది. ఈ దేశాల నుంచి వస్తున్న ప్రయాణికులను 14 రోజులు క్వారంటైన్ చేసి.. నెగిటివ్ అని తేలితేనే బయటకు పంపాలి అనేది కేంద్ర ప్రభుత్వం సూచన అని సీఎం తెలిపారు. ఈ దేశాల నుంచి హైదరాబాద్‌కు నేరుగా విమానాలు ఉన్నాయి. అయితే వచ్చే వారు ఏ దేశం నుంచి వస్తున్నారో కూడా తెలియడం లేదు. గత వారం రోజుల నుంచి అప్రమత్తంగా ఉన్నాం. 200 మంది ఆరోగ్య శాఖ సిబ్బంది శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉండి పరీక్షలు నిర్వహిస్తున్నారు అని సీఎం కేసీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ దేశానికి పట్టిన అతిపెద్ద కరోనా

కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్కపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిప్పులు చెరిగారు. కరోనా వైరస్‌పై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కరోనా కట్టడికి కేంద్రం, రాష్ట్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై కేసీఆర్ స్పందిస్తూ.. కరోనా వంటి సున్నిత అంశాలను రాజకీయం చేయొద్దు. ప్రజలను భయాందోళనకు గురి చేయొద్దు అన్నారు. ఈ దేశానికి పట్టిన భయంకరమైన కరోనా వైరస్.. కాంగ్రెస్సే అని సీఎం విమర్శించారు. దేశానికి పట్టిన ఆ దరిద్రం ఇప్పటికే వదిలింది అని కేసీఆర్ అన్నారు. కరోనా నియంత్రణకు కేంద్రం ఏమీ చేయడం లేదనే మాటలు సరికాదన్నారు. కేంద్రం అనేక ముందు జాగ్రత్తలు తీసుకుంటుందని సీఎం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను ప్రజలంతా పాటించాలి. తమ బాధ్యతను వంద శాతం చిత్తశుద్ధితో నిర్వహిస్తామని సీఎం స్పష్టం చేశారు. అన్ని విషయాలపై ఇప్పటికే చర్చించాం. అన్ని డిపార్ట్‌మెంట్ల నివేదికలు వస్తాయి. సాయంత్రం 6 గంటలకు జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుని కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను ప్రకటిస్తామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

భారత్‌లో మెల్లగా విస్తరిస్తున్న కరోనా

రెండుకు చేరిన మృతుల సంఖ్య
82కు చేరిన బాధితులు..భయం లేదంటున్న ఆరోగ్య శాఖ

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): భారత్‌లో కరోనా మెల్లగా మృత్యు ఘంటికలు మోగిస్తోంది. తాజాగా కరోనా కాటుకు ఢిల్లీకి చెందిన మహిళ బలైంది. దీంతో దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య రెండుకు చేరగా బాధితుల సంఖ్య 82కు పెరిగింది. దేశంలో కరోనా వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే కరోనాతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మరోమారు స్పష్టం చేసింది. మొత్తం రోగుల్లో 71 మంది పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించింది. ఇక ఇటలీ, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను ఇవాళ భారత్ తీసుకురానున్నట్టు తెలిపింది. ఇదిలా ఉంటే కరోనా కట్టడికి ఢిల్లీ, హరియాణా, పంజాబ్, మధ్యప్రదేశ్, జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా,కేరళ, కర్ణాటక,యూపీ ప్రభుత్వాలు స్కూళ్లు, సినిమాహాళ్లు, జిమ్‌లు, స్విమ్మింగ్ పూల్స్ మూసివేతకు ఆదేశాలిచ్చాయి. మనేసర్ లోని క్యారంటైన్ కేంద్రంలో ఉన్న ఇటలీ నుంచి వచ్చిన భారతీయుడికి కరోనా వైరస్ నిర్ధారణ అయ్యింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 81 పాజిటివ్ కేసులు నమోదుకాగా, అందులో ఒకరు కర్ణాటకలో మృతిచెందారు. 81 కేసుల్లో 61 మంది భారతీయులు, 16 మంది ఇటాలీయన్లు, కెనడాకు చెందిన వ్యక్తికి వైరస్ సోకినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. కేరళలో అత్యధికంగా 19 కేసులు నమోదుకాగా, మహారాష్ట్రలో 14 కేసులు, యూపీలో 11 కేసులు, ఢిల్లీ, కర్ణాటకలో ఆరు కేసులు, లడఖ్ లో మూడు కేసులు నమోదైనట్లు కేంద్రం ఆరోగ్య శాఖ వెల్లడించింది. కరోనా వైరస్ కారణంగా ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే పక్రియ కేంద్రం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం రెండో విడతలో 44 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. తాజాగా, ఇరాన్ నుంచి వచ్చిన భారతీయులకు రాజస్థాన్ లోని జైసల్మేర్ లో ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన కేంద్ర ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ తెలిపారు. 11 లక్షల 70 వేల 61 మందికి స్క్రీనింగ్ టెస్టులు జరిపినట్లు ఆయన తెలిపారు. మరోవైపు కరోనాపై ఉమ్మడి పోరాటానికి సార్క్ దేశాలు కలిసి రావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోరాదని సూచించారు.

ఆర్ఎస్ఎస్ సభలు రద్దు

బెంగళూరు,మార్చి14(ఆర్ఎన్ఎ): బెంగళూరులో తలపెట్టిన అఖిల్ భారతీయ ప్రతినిధి సభ సమావేశాలను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) రద్దు చేసింది. ఈ నెల 15 నుంచి 17 వరకు బెంగళూరులో ఆర్ఎస్ఎస్ సమావేశాల నిర్వహణ తలపెట్టింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో పబ్లిక్ మీటింగ్‌లపై కర్ణాటక ప్రభుత్వం నిషేదాజ్ఞలు విధించింది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బెంగళూరులో ప్రారంభం కానున్న ఆర్ఎస్ఎస్ సమావేశాలను రద్దు చేస్తున్నట్లు సంఘ్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి తెలిపారు. ఇప్పటికే కర్నాటకలో ఆంక్షలు విధించారు. షాప్స్,మాల్స్, సినిమా హాళ్లు మూసేసారు.

మైక్రోసాఫ్ట్ నుంచి తప్పుకున్న బిల్‌గేట్స్

డైరెక్టర్ల బోర్డు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన
కేవలం ఇక సలహాలకు మాత్రమే పరిమితం అని వెల్లడి
గేట్స్‌తో కలసి పనిచేయడం అద్భుతం అన్న సత్యనాదెల్ల

శాన్‌ఫ్రాన్సిస్కో,మార్చి14(ఆర్ఎన్ఎ): మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ మైక్రోసాఫ్ట్‌కు రాజీనామా చేశారు. మైక్రోసాఫ్ట్ సంస్థ డైరెక్టర్ల బోర్డు నుంచి బిల్‌గేట్స్ తప్పుకున్నారు. ఆయన సాంకేతిక సలహాదారుడిగా కొనసాగనున్నారు. సంస్థ డెరెక్టర్ల బోర్డు నుంచి తప్పుకుంటున్నట్టు ఆయన ప్రకటించారు. దాతృత్వ కార్యక్రమాలకు మరింత సమయం వెచ్చించేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్టు బిల్‌గేట్స్ తెలిపారు. 64 ఏళ్ల బిల్‌గేట్స్ సుమారు పదేళ్లుగా సంస్థ రోజువారీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, తన భార్య మిలిందాతో కలిసి ఏర్పాటు చేసిన ఫౌండేషన్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తూ వస్తున్నారు. 2014 ప్రథమార్థం వరకూ మైక్రోసాఫ్ట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్‌గా సేవలందించిన ఆయన ఇప్పుడు పూర్తిగా వైదొలుగుతున్నారు. బెర్క్‌షైర్ హాత్‌వే బోర్డు నుంచి కూడా వైదొలుగుతున్నట్టు బిల్ గేట్స్ తాజాగా ప్రకటించారు. బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి, విద్య, పర్యావరణ మార్పులపై పోరాడం వంటి దాతృత్వ కార్యక్రమాలకు మరింత కృషి చేయాలని నిశ్చయించుకున్నానని చెప్పారు. బెర్క్‌షేర్, మైక్రోసాఫ్ట్ మునుపెన్నడూ లేనంత పటిష్టంగా ఉన్నందున, సంస్థ డైరెక్టర్ల బోర్డు నుంచి తప్పుకోవడానికి ఇదే తగిన సమయంగా భావించినట్టు ఆయన తెలిపారు. కాగా, బిల్‌గేట్స్ నిష్క్రమణపై ఆ సంస్థ సీఈవో సత్యనాదెల్ల మాట్లాడుతూ, గేట్స్‌తో పనిచేయడం ఎంతో గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఆయనతో కలిసి పనిచేయడం ద్వారా ఎంతో నేర్చుకున్నామని అన్నారు. సాఫ్ట్‌వేర్ ప్రయోజనాలను ప్రజలకు మరింత చేరువ చేసి, సమాజంలోని సవాళ్లను పరిష్కరించాలనే లక్ష్యంతోనే మైక్రోసాఫ్ట్‌ను బిల్ స్థాపించారని, సాంకేతికత పట్ల ఆయనకు ఉన్న తృష్ణను సంస్థ మరింత ్టైం పనికి కూడా ఆయన గుడ్‌బై చెప్పారు. సంస్థ సలహాదారుగా బిల్ కొనసాగుతారని చెప్పారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెల్ల, ఇతర ప్రముఖులకు సాంకేతిక సహకారం అందించనున్నారు బిల్‌గేట్స్. దాతృత్వ కార్యక్రమాలకు ఎక్కువ సమయం కేటాయించేందుకు బిల్‌గేట్స్ వైదొలిగారు. 1975లో పాల్ అలెన్‌తో కలిసి బిల్‌గేట్స్ మైక్రోసాఫ్ట్ స్థాపించారు. బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా పలు దేశాల్లో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్య, ఆర్థికం, ఉపాధి కల్పనా రంగాల్లో ఫౌండేషన్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 2014లో బిల్‌గేట్స్ మైక్రోసాఫ్ట్ చైర్మన్ పదవి నుంచి వైదొలిగారు. 2000లో సీఈవో పదవికి రాజీనామా చేసిన బిల్‌గేట్స్.. 2008 నుంచి ఫుల్ టైం పనికి కూడా ఆయన గుడ్‌బై చెప్పారు.

ఇకనుంచి 57 ఏళ్లకే పెన్షన్లు

ఆర్థిక మాంద్యం ఉన్నా పంపిణీ
పెన్షన్ల కోసం ప్రతి నెల రూ. 879 కోట్లు
అసెంబ్లీలో మంత్రి ఎర్రబెల్లి ప్రకటన

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): మార్చి నెల తర్వాత రాష్ట్రంలో 57 ఏళ్ల వయసువారందరికి పెన్షన్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఆర్థిక మాంద్యం ఉన్నా పెన్షన్లు ఆగడం లేదన్నారు. అలాగే పెంచిన పెన్షన్లు ఇవ్వడమే గాకుండా, వయసు తగ్గించి భారమైనా పేదలను ఆదుకుంటున్నామని చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా ఆసరా పింఛన్లపై సభ్యులు ధర్మారెడ్డి, చందర్, వీరయ్య, జాఫర్ హుస్సేన్, రాజాసింగ్, భాస్కర్‌రావు, రామ లింగారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. రాష్ట్రంలో కళ్లుగీత కార్మికులు, వృద్ధులకు, వికలాంగులకు, హెచ్ఐవీ, వితంతువులకు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు, చేనేత కార్మికులు, బోధకాల వ్యాధిగ్రస్తులకు ఈ పథకం వర్తించేట్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం పింఛన్‌దారులు 38 లక్షల 77 వేల 717 మంది ఉన్నారు. పింఛన్ల రూపంలో వీరికి ప్రతి నెల రూ. 879 కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. వృద్ధాప్య పింఛన్ల వయస్సు 65 నుంచి 57 ఏళ్లు చేస్తే అదనంగా మరో 6 లక్షల 62 వేల మంది లబ్దిదారులు అవుతారన్నారు. కొత్తగా ఇచ్చేవారిని కలుపుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ. 11 వేల 758 కోట్లు అవుతుందన్నారు. కాగా కేంద్రం ఇచ్చేది కేవలం రూ. 203 కోట్లు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న వాళ్లందరికీ కూడా పింఛన్లు ఇస్తున్న మహాత్ముడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు

మోదీ పిలుపుకు పాక్ సానుకూల స్పందన

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రపంచ దేశాలను కబళిస్తున్న కరోనా మహమ్మారిపై ఉమ్మడిగా పోరాడుదామని సార్క్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుకు పాకిస్థాన్ సానుకూలంగా స్పందించింది. కోవిడ్-19 వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 5 వేల మంది మృతిచెందారు. కరోనా వైరస్ ప్రపంచ దేశాలకు వేగంగా విస్తరిస్తుంది. ఈ నేపథ్యంలో బలమైన వ్యూహాన్ని రచించేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చిద్దామని భాగస్వామ్య దేశాధినేతలందరిని ప్రధాని మోదీ కోరారు. మోదీ పిలుపుకు పాకిస్థాన్ సానుకూలంగా స్పందించింది. వీడియో కాన్ఫరెన్స్‌లో తాము కూడా పాల్గొననున్నట్లు పాక్ ప్రధాని హెల్త్ అసిస్టెంట్ జాఫర్ మిర్జా తెలిపారు. కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా పాక్‌లో ప్రచారం జాఫర్ మిర్జా నేతృత్వంలో కొనసాగుతోంది. కోవిడ్-19 వ్యాధితో భారత్‌లో ఇద్దరు మరణించగా పాక్‌లో ఇప్పటి వరకు ఎటువంటి మరణాలు సంభవించలేదు. పాక్‌లో కరోనా కేసులు 28 నమోదయ్యాయి. అదే భారత్ కరోనా కేసుల సంఖ్య 83కు చేరుకుంది.

గర్భిణులకు అండగా ప్రభుత్వం చేయూత

ప్రభుత్వాసుపత్రుల్లో సుఖ ప్రసవాలకు ప్రోత్సాహం
కెసిఆర్ కిట్‌తో పెరిగిన ప్రసవాల సంఖ్య
అసెంబ్లీలో మంత్రి ఈటెల రాజేందర్ వెల్లడి

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): గర్భిణులకు ఎలాంటి సమస్య లేకుండా ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలు చేయిస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ తెలిపారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూస్తున్నామని అన్నారు. మహిళ తొలిసూరు కాన్పు సహజంగా తల్లిగారింట్లో జరుగుతది. కాన్పు అనంతరం తల్లిని పిల్లను అత్తగారింటికి పంపిస్తరు. ఇటు తల్లిగారింటికి అక్కరలేకుండా.. అటు అత్తగారింటికి అక్కరలేకుండా తామున్నామంటూ వాళ్లకు 104 వాహనం పంపించి.. ఆస్పత్రికి తీసుకువచ్చి.. డెలివరీ చేయించి.. కిట్టు ఇచ్చి.. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగపిల్లవాడు పుడితే రూ. 12 వేలు తిరిగి ఇంటికి పంపిస్తున్న ఏకైక తొలి రాష్ట్రం దేశంలో తెలంగాణ అని అసెంబ్లీలో వివరించారు. కేసీఆర్ కిట్ ఉద్దేశ్యం ఇదేనని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... కేసీఆర్ కిట్ పథకం ద్వారా ఇప్పటి వరకు 6,47,823 కుటుంబాలకు లబ్దిపొందాయన్నారు. రూ.826.50 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 30 శాతం ఉన్న ప్రసవాలు కేసీఆర్ కిట్‌తో 51 శాతానికి పెరిగాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైనంత మంది వైద్యులు, సిబ్బంది ఉన్నరన్నారు. దాదాపు రూ. 28 కోట్లతో లేబర్ రూంలను డెలివరీల కోసం అభివృద్ధి చేసుకున్నాం. అదేవిధంగా రూ. 640.35 కోట్లతో 39 మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రులను నిర్మించి అక్కడ సర్వీసులను అందిస్తున్నాం. చిన్నపిల్లలు పుట్టగానే వారికి వార్మసీ గానీ, ఫోటోథెరపి మిషన్లు వంటి ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రుల్లో 229 మంది గైనకాలజిస్టు వైద్యులు, 208 మంది అనస్థీషియా డాక్టర్లు, 205 మంది చిన్న పిల్లల డాక్టర్లు, 1225 మంది స్టాఫ్ నర్సులు, 1051 మంది డీఈవోలను ఇప్పటికే నియమించినట్లు తెలిపారు. మాతృత్వం తియ్యటి కల అని స్త్రీ భావిస్తుంది. ఆ ఆశయాన్ని, ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఇటీవలనే తొమ్మిది మాతాశిశు సంక్షేమ ఆస్పత్రులకు అనుమతులు తెలిపినట్లు పేర్కొన్న మంత్రి ఆ ఆస్పత్రులను కూడా త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

అక్రమాలను నిర్మూలించడంతో ఆదాయం పెరిగింది : మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ , మార్చి 14: అక్రమాలను నిర్మూలించడంతో మద్యంపై వచ్చే ఆదాయం పెరిగిందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంత్రులు శాసనసభలో వ్యవసాయం, పశుసంవర్ధక, సహకార, పౌరసరఫరాలు, రెవెన్యూ, వాణిజ్యపన్నులు, ఎక్సైజ్, హోం, రవాణాశాఖ పద్దులను ప్రవేశపెట్టారు. పద్దులపై చర్చలో భాగంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గత పాలకులు గీత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. గీతకార్మికులకు అండగా ఉన్నానంటూ సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారన్నారు. తెలంగాణ వందశాతం గుడుంబా రహిత రాష్ట్రంగా మారిందన్నారు. నాటుసారా తయారీపై ఆధారపడిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలపై గిరిజనులు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ ఏడాదిలోనే ట్యాంక్‌బండ్‌పై నీరా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాల పెరుగుదల చాలా స్వల్పంగా ఉందన్నారు. మద్యనిషేధం కావాలంటే ప్రజల్లో అవగాహన రావాలని మంత్రి పేర్కొన్నారు.

విద్యాసంస్థల మూసివేతకు ఆదేశాలు

జైపూర్,మార్చి14(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్‌లు, జిమ్స్, సినిమా హాళ్లను మూసివేస్తున్నట్లు రాజస్థాన్ ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు ఈ నెల 30వ తేదీ వరకు అమల్లో ఉండనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ప్రారంభమైన బోర్డు ఎగ్జామ్స్ షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగనున్నట్లు సీఎంవో కార్యాలయం వెల్లడించింది. దేశంలో కోవిడ్-19 కారణంగా ఇద్దరు మృత్యువాతపడ్డారు. మరో 82 మంది కరోనా వైరస్ భారిన పడ్డారు. ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే తమ తమ రాష్ట్రాల్లో విద్య

వినియోగదారులూ...జాగ్రత్త..!

నేటినిజం
ఆదివారం 15-3-2020

ఆదా చేద్దాం అనేది సగటు మనిషి వాడే పదం. ఏమాత్రం అవకాశం వచ్చినా డబ్బును దాచేందుకు పరితపించడం మనం గమనిస్తూనే ఉంటాది. కానీ ఒక పెద్ద ఆదా విషయంలో మాత్రం మినహాయింపు ఇవ్వడం జరుగుతోంది. అదే సిగరెట్టు, గుట్కా విషయాలలో ఆదాని ఎందుకు మరిచిపోతున్నారో అర్థం కాని స్థితి నేడు నెలకొంది. ఈ రెండు దురలవాట్లపై చేసే వ్యయం వాటివల్ల వచ్చే వ్యాధుల చికిత్సకు చేసే ఖర్చు 30 ఏళ్ళలో కాలంలో సుమారు 52 లక్షల వరకు ఉంటుందని ఓ పత్రిక నిర్వహించిన సర్వేలో పేర్కొంది. అయితే కొందరికి సరదా. మరికొందరికి అలవాటు. మరి కొందరికి ఓ ఫ్యాషన్ పేరేదయినా వదల లేని వ్యసనంగా మారిన దుర్వ్యసనాలు చివరికి ప్రాణాలనే హరిస్తున్నాయి. పొగ తాగటం అనేది కేవలం ఉత్తేజం కోసమని కొందరంటే మానసిక అలసటను తగ్గించుకోవడం కోసం అని మరికొందరు ఆకతాయి మూకల విశ్లేషణతో తమ జేబుకే కాదు ఏకంగా తమ జీవితానికే చిల్లు పెట్టుకుంటున్నారు. పొగ తాగడం వలన వచ్చే అనర్థాలపై ఒక పత్రిక ఇటీవల నిర్వహించిన సర్వే పలు ఆసక్తికరమయిన విషయాలు వెల్లడించింది. తాగటం ప్రారంభించిన 30 ఏళ్లలో వాటికయ్యే ఖర్చు, వాటివల్ల వచ్చే అనర్థాల బారినుండి బయటపడేందుకు పెట్టే వ్యయం కలిపి దాదాపు 52 లక్షలు ఖర్చు అవుతారని లెక్క తేలింది. అందులో ఆశ్చర్యమున్నా ఆ సంగతి అలా ఉంచితే పొగ తాగే అలవాటు వలన జీవితం ఎలా ఖర్చు అవుతుందో సర్వే పేర్కొంది. పొగతాగటం గుట్కా నమలటం వంటి దురలవాట్లు వ్యక్తి ఆర్థిక స్థితికి పెద్ద చిల్లు పెడతాయి. మనలో లైట్‌గా స్మోక్ చేసేవారయితే రోజుకు 5 సిగరెట్లు తాగుతారు.

మీ సంపాదనలో ఏడాదికి పదివేల రూపాయలు హరించుకుపోతున్నాయి. అదే గుట్కా తాగడానికి అలవాటు పడితే ఏడాదికి ఏడువేలు ఖర్చవుతుంది. పొగాకులో నికోటిన్ విషపదార్థం ఉంటుంది. అది కొవ్వులో కరిగి రక్త పరఫరాపై ప్రభావం చూపుతుంది. నికోటిన్‌కు మనసును అమితంగా తొందరగా ప్రభావితం చేస్తుంది. గుండె సంబంధ మయిన వ్యాధులతో పాటు కాన్సర్, నోటి, గొంతు, స్వరపేటిక, అన్నవాహిక, మూత్రపిండాల క్యాన్సర్, మహాదమని వాపు, రక్తం గడ్డ కట్టడం,గుండె పోటుక పొగ కారణమవుతుంది. గుట్కా పాన్ పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ తో పాటు అధిక రక్తపోటు, గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

సాధారణ వ్యక్తికన్నా ఈ దురలవాట్లు ఉన్న వ్యక్తులు ఎక్కువ జబ్బున పడతారు. పలుమార్లు వైద్య పరీక్షలు చేయించుకోవల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఈ ధూమపానం అలవాట్లు ఉన్నవారు ఉద్యోగ భద్రత ఏమాత్రం ఉండదు. సొంతంగా వ్యాపారాలు చేస్తున్న పొగరాయుళ్ళు అనారోగ్యాలబారిన పడి పని వత్తడిని తట్టుకునే శక్తిని కోల్పోతారు. క్రమంగా వ్యాపారం దెబ్బతింటుంది. దాంతో ఉద్యోగంలో చేరడంతో అక్కడ ఏకాగ్రత లేకుంటే తీసి వేస్తారు. ఆ విధంగా ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది. కనుక పొగాకు వినియోగదారులూ తస్మాత్ జాగ్రత్త!

కర్నాటకలో కరోనాపై అప్రమత్తం అయిన సర్కార్

వారం రోజుల పాటు మాల్స్, థియేటర్లు, స్కూళ్లు మూసివేత

కరోనా మృతి కేసుతో అధికారులతో సమీక్షించిన సిఎం యెడ్యూరప్ప

బెంగళూరు,మార్చి14(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడికి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. కర్ణాటకలో కరోనా వైరస్‌తో 76 ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన దరిమిలా .. సీఎం యెడియూరప్ప అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి.. కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశం అనంతరం సీఎం యెడియూరప్ప మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల పాటు మాల్స్, విద్యాసంస్థలు, థియేటర్లు, నైట్ క్లబ్‌లు, పబ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్‌ను మూసివేయనున్నట్లు సీఎం ప్రకటించారు. వివాహాలు, క్రీడా పోటీలు, సదస్సులు వాయిదా వేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా నడుస్తాయని సీఎం యెడియూరప్ప స్పష్టం చేశారు. కర్ణాటకలో కరోనా పాజిటివ్ కేసులు ఐదు నమోదు అయ్యాయి. ఈ ఐదుగురిలో గూగుల్ ఉద్యోగి కూడా ఉన్నాడు. అయితే భారత దేశంలో కరోనా వైరస్ కారణంగా మరణించిన తొలి వ్యక్తికి వైద్య సంరక్షణ సక్రమంగా అందలేదని ఆయన కుటుంబీకులు ఆరోపించారు.బాధితుని కుమారుడు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తన తండ్రిని ఆసుపత్రికి తీసుకెళ్ళిన వెంటనే వైద్యులు చికిత్స చేసి ఉంటే, ఆయన బతికి ఉండేవారని ఆవేదనతో చెప్పారు. ముందుగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి ఆయనను తీసుకెళ్ళగా, చికిత్స చేసేందుకు నిరాకరించారని చెప్పారు. అనంతరం ఈ నెల 8న మరొక ఆసుపత్రికి తీసుకెళ్ళామని, అయితే ఆ ఆసుపత్రివారు కూడా తన తండ్రిని హైదరాబాద్ తీసుకెళ్ళిపోవాలని చెప్పారని తెలిపారు. తాము హైదరాబాద్ వెళ్ళేందుకు సిద్ధంగా లేమని, అయినప్పటికీ తమను బలవంతపెట్టి హైదరాబాద్ వెళ్ళేలా చేశారని తెలిపారు. తాము హైదరాబాద్ తీసుకెళ్ళామని, అయితే అక్కడ ఏ ఆసుపత్రివారూ ఆయనను చేర్చుకోలేదని, ఆయన దుబాయ్ నుంచి వచ్చినందువల్ల తాము చేర్చుకోబోమని చెప్పారని తెలిపారు. మరొక ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల తన తండ్రిని గుల్బర్గా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తీసుకెళ్ళామని, అయితే మరణించిన వ్యక్తిని తీసుకొచ్చారని అక్కడి వైద్యులు చెప్పారని తెలిపారు. ఈ నెల 9 సాయంత్రం 4 గంటల నుంచి 10వ తేదీ ఉదయం 2 గంటల వరకు తాము హైదరాబాద్‌లో అంబులెన్స్‌లో తిరిగామని, ఏ ఆసుపత్రిలోనూ తన తండ్రికి చికిత్స చేయించలేక పోయామని తెలిపారు. ఇదిలావుండగా, కలబురగి డిప్యూటీ కమిషనర్ శరత్ వాదన మరోలా ఉంది. వైద్య సలహాకు విరుద్ధంగా రోగిని ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళ్లారని, ఆ విషయం తెలిసిన వెంటనే ఆ రోగిని తిరిగి గుల్బర్గా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (గిమ్స్)కు తీసుకొచ్చేందుకు ఓ బృందాన్ని హైదరాబాద్ పంపించామని తెలిపారు. ఆ రోగిని గిమ్స్‌కు తీసుకొచ్చిన తర్వాత ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పారని తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో ఆరుగురు మంత్రులకు ఉద్వాసన

సిఎం సిఫార్సుతో తొలగించిన గవర్నర్ టాండన్

భోపాల్,మార్చి14(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్ గవర్నర్ లాల్జీ టాండన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సిఫారసు మేరకు మంత్రివర్గంలోని ఆరుగురు మంత్రులపై గవర్నర్ బహిష్కరణ వేటు వేశారు. తిరుగుబాటు చేసిన ఆరుగురిని మంత్రివర్గం నుంచి తొలగించారు. వీరంతా కమల్‌నాథ్‌కు ఏమాత్రం అందుబాటులో లేకుండా బెంగళూరుకు తరలివెళ్లిన మంత్రులే కావడం విశేషం. కమల్‌నాథ్ నాలుగురోజుల క్రితమే తన మంత్రివర్గ సహచరులతో సమావేశమై మంత్రివర్గ పునర్వవస్థీకరణకు సన్నాహాలు చేశారు. అందుబాటులో లేకుండా బెంగళూరు తరలివెళ్లిన ఆరుగురు మంత్రులపై ఆయన బహిష్కరణ వేటుకు సిద్ధపడ్డారు. ఈ మేరకు గవర్నర్‌కు సిఫారసు కూడా చేశారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ లక్నో వెళ్లడంతో తాను భోపాల్ చేరుకోగానే ఆ లేఖ విషయం పరిశీలిస్తానని ఆయన చెప్పారు. భోపాల్ చేరుకున్న లాల్జీ టాండన్ ఆ లేఖను పరిశీలించి ముఖ్యమంత్రి సిఫారసు మేరకు ఆరుగురు మంత్రులను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. బహిష్కరణ వేటు పడిన మంత్రుల్లో ఇమర్తి దేవి, తుల్సి సిలావత్, గోవింద్ సింగ్ రాజ్‌పుట్, మహేంద్ర సింగ్ సిసోడియా, ప్రద్యుమ్న సింగ్ తోమర్, ప్రభురాం చౌదరి ఉన్నారు. జ్యోతిరాదిత్య ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయగానే, బెంగళూరుకు వెళ్లిన ఆరుగురు మంత్రులతో సహా మొత్తం 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీ ప్రతినిధి బృందం ఈ ఎమ్మెల్యేల లేఖలను అసెంబ్లీ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతికి సమర్పించారు. వ్యక్తిగతంగా తనను ఎమ్మెల్యేలు కలిసిన తర్వాత, వారి వివరణ, కారణాలను విశ్లేషించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ ఇప్పటికే ప్రకటించారు.

వైభవంగా భద్రాద్రి నవమి ఉత్సవాలు

వేడుకలపై అధికారులతో మంత్రి ఇంద్ర సమీక్ష

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా నవమి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 2న భద్రాద్రిలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. శుక్రవారం అరణ్య భవన్‌లోని ఆయన చాంబర్లో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... ఈ నెల 25నుంచి ఏప్రిల్ 8 వరకు జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని, ఆ దిశగా అన్నిశాఖల అధికారులు సమన్వంతో కలిసి పనిచేయాలన్నారు. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ఏర్పాట్లలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావద్దన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలప్పుడు వాహనాల పార్కింగ్ ప్రధాన సమస్యగా ఉంటుందని... పార్కింగ్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్యాణవేదిక వద్ద సీటింగ్ కెపాసిటీ ఏర్పాటు మరింత పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విధానంలో జిల్లా పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1న ఎదుర్కోలు ఉత్సవం, 2 కళ్యాణ మహోత్సవం, 3న మహా పట్టాభిషేకం ఉంటుందని అధికారులు వివరించారు. ఈ సమావేశానికి దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, ఈవో నర్సింహులు, ఇతర అధికారులు హాజరయ్యారు.

వెంకయ్యనాయుడుతో పౌల్ట్రీ ప్రతినిధుల భేటీ

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): పౌల్ట్రీ ఉత్పత్తులపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు ఉమ్మడిగా పనిచేయాలని పౌల్ట్రీ అసోసియేషన్‌కు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. ఆల్ ఇండియా ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బహదూర్ అలీ నేతృత్వంలో పరిశ్రమ పెద్దలు శుక్రవారం వెంకయ్యనాయుడిని కలిశారు. కరోనా భయంతో పౌల్ట్రీ రంగానికి జరిగిన నష్టాన్ని ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన మెడికల్ రీసెర్చ్ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ తో మాట్లాడారు. ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని ఆదేశించారు. లేకుంటే దీనిపై అపోహలు పెరుగుతాయన్నారు. కరోనా భయంతో ఈ రంగం దెబ్బతిన్నదని వీరు వెంకయ్యానాయుడుకు వివరించారు. తమను ఆదుకోవాలని కోరారు.

సార్క్ దేశాలతో కలసికట్టు పోరాటం

హైదరాబాద్, మార్చి 14: కరోనాపై భారత్ పటిష్ట చర్యలు తీసుకుంటున్నా విదేశాల నుంచి వస్తున వారి నుంచి వైరస్ విస్తరిస్తోంది. ఇప్పటికే గట్టి చర్యలు తీసుకుంటున్నా కరోనా మృత్యుఘంటికలు మోగించేందుకు సిద్ధపడింది. ఇప్పటికే ఇద్దరు మరణించగా..దాదాపు 88మంది వ్యాధి బారిన పడ్డారని లెక్కలు చెబుతున్నాయి. ఈ దశలో ప్రధాని మోడీ కూడా తక్షణ చర్యలకు ఉపక్రమించడమే గాకుండా సార్క్ దేశాధినేతలతో మాట్లాడి ఉమ్మడిగా పోరాటాన్ని చేద్దామన్న సంకల్పాన్ని ప్రకటించారు. నిజంగా ఇదో ముందడుగానే భావించాలి. ఈ చొరవ కారణంగా ప్రాంతీయంగా మనలను మనం రక్షించుకునే అవ్ఆవం ఏర్పడనుంది. అలాగే గట్టి చర్యలకు అవకాశం కలుగుతుంది. ప్రపంచ దేశాలను కబళిస్తున్న కరోనా మహమ్మారిపై ఉమ్మడిగా పోరాడుదామని దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సమాఖ్య సార్క్ దేశాలకు ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు బలమైన వ్యూహాన్ని రచించేందుకు భాగస్వామ్య దేశాధినేతల ందరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చిద్దామని ట్విట్టర్ వేదికగా ప్రతిపాదించారు. దీనిపై పాకిస్థాన్ మినహా మిగిలిన అన్ని సభ్యదేశాల నుంచి సానుకూల స్పందన లభించింది. పాక్ ఎప్పుడూ ఇలాంటి ప్రతిపాదనలకుఎప్పుడూ స్పందించడం చేయదు. మోదీ ప్రతిపాదనను శ్రీలంక అధ్యక్షుడు గోటబయ రాజపక్స, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి, మాల్దీవులు అధ్యక్షుడు ఇబ్రహీం అహ్మద్ సోలీ, భూటాన్ ప్రధాని లోటే షెరింగ్, బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి షఫ్రియార్ ఆలం, ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడి అధికార ప్రతినిధి స్వాగతించారు. ఇది సార్క్ దేశాలకు మనపై ఉన్న భరోసాగా చూడాలి. ఆయా దేశాల సహకారంతో కరోనాను ఎదుర్కొనరేందుకు సిద్ధం కావడం..తోటి దేశాలను సంసిద్ధం చేయాలనుకోవడం ఓ మంచి నిర్ణయంగా చూడాలి. మొత్తంగా కరోనా కారణంగా ప్రపంచం యావత్తూ ఒకేవిధంగా కలసి ఆలోచించేట్టు చేస్తున్నది. అన్నిదేశాలూ తీవ్రమైన ఈ సమస్య గురించి ఉమ్మడిగా ఆలోచించడం ఇదే ప్రథమం. ఎయిడ్స్ లాంటి వ్యాధులు కూడా ఇంతగా కలవరపెట్టలేదు. ఎబోలా కూడా పెద్దగా భయపెట్టలేదు. ఇకపోతే కరోనా వైరస్ తెచ్చిన ముప్పు కన్నా దాని ప్రభావం వల్ల ఏర్పడ్డ ఆర్థికవిపత్తు మరింత భయానకంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఆర్థికనష్టాన్ని పూడ్చడం సమీపకాలంలో సాధ్యమేనా అన్న ఆందోళన కలుగుతోంది. అసలే ఆర్థిక రంగం కుదేలైన స్థితిలో భారత్ లాంటి దేశాలకు పెద్ద దెబ్బగా భావించాలి. మరో కరోనా వైరస్ కనీసం ఏడాది పాటు ప్రపంచంమీద పెత్తనం చేయవచ్చునంటూ సింగపూర్ ప్రధాని చేసిన ప్రకటన కచ్చితంగా ఆందోళన కలిగించేదే. చాలా దేశాల మాదిరిగా సింగపూర్ విదేశీయుల రాకపోకలను నిషేధించలేదు కానీ, వ్యాప్తి నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. సామాజిక మాధ్యమాల యుగంలో ప్రజలకు సమాచారాన్ని చేరవేయడం, వారిని కర్తవ్యోన్ముఖులుగా మార్చడం ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా మారాలి. ఎందుకంటే కరోనా విస్తరణ వేగం పెరుగుతున్నది. వారం క్రితం దాకా ధైర్యంగా కనిపించిన దేశాలు ఇప్పుడు చుట్టూ రక్షణ కంచెలు నిర్మిస్తున్నాయి. సరిహద్దులను మూస్తేస్తున్నాయి. భారత్ కూడా సరిహద్దు దేశాల నుంచి రాకపోకాలు లేకుండా సరిహద్దులను మూసేయాలని నిర్ణయించింది. కరోనా సవాళ్లతో తమ దేశాలకు ఎవరూ రావద్దని, దేశం విడిచి పోవద్దని ఆయచా దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో ప్రపంచ దేశాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. సరుకుల రవాణా ఇప్పటికే ఆగిపోయింది. అడ్డుగోడల వల్ల మొత్తంగా ప్రపంచ వాణిజ్యం కూడా పూర్తిగా పడిపోయింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ వ్యాధి పట్ల ప్రజల్లో తీవ్ర భయాందోళనలకు నిదర్శనంగా చూడాలి. ప్రజల మధ్య పలుకరింపులు పోయి తలుపులు వేసుకుని కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది. భారత్‌లో కూడా మాల్స్, సినిమాహాళ్లు మూతపడుతున్నాయి. వీధుల్లో రాకపోకలు తగ్గాయి.

విద్యా వాణిజ్య కేంద్రాలకు జనసంచారం తగ్గింది. క్రీడలపై ఆంక్షలు వచ్చి పడ్డాయి. దీంతో ఐపిఎల్ లాంటి క్రికెట్ పోటీలు వాయిదా పడడంతో క్రీడామైదానాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మరోపక్క రోగాన పడుతున్న రాజకీయ నాయకులు, హాలీవుడ్ నటులు, క్రీడాకారుల సంఖ్య కూడా పెరుగుతున్నది. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనాను మహమ్మారిగా నిర్ధారించింది. పెరుగుతున్న మరణాలతో, చేజారిపోతున్న పరిస్థితుల మధ్య అగ్రరాజ్యం అమెరికా తన ఆగ్రహాన్ని యూరప్‌మీద ప్రదర్శించింది. ఆ ఇరవై ఆరు దేశాలతో రాకపోకలు నిషేధించింది. చైనావారిని యూరోపియన్ దేశాలు స్వేచ్ఛగా రానివ్వడంతో ఈ సమస్య అమెరికా నెత్తికి చుట్టుకున్నదని ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. కరోనాను ప్రపంచానికి అంటించిన చైనా మాత్రం కోలుకుంటోంది. ఇదంతా అమెరికా పాపమేనని ఎదురుదాడికి దిగింది. అయితే ముందు జాగ్రత్తలు తీసుకోండని, అలసత్వం వహిస్తే ముప్పుతప్పదని ప్రపంచదేశాలకు ఆరోగ్య సంస్థ గట్టి హెచ్చరికలే చేసింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా తగు జాగ్రత్తలతో కలసికట్టుగా కరోనాను తరిమేద్దామంటూ ప్రజలకు ధైర్యవచనాలు చెప్పారు. మిగతా దేశాల మాదిరిగానే భారత్ సైతం వీసాల రద్దుకు ఉపక్రమించింది. పదిహేనవ తేదీ తరువాత కొన్ని దేశాలనుంచి లేదా ఆ దేశాల మీదుగా భారత్‌లో కాలూనిన వారిని కచ్చితంగా పద్నాలుగురోజులు క్వారంటైన్ చేయాలని కూడా నిర్ణయించుకుంది. తన దేశ పౌరులను విదేశీప్రయాణాలు వాయిదావేసుకోమని హితవు చెప్పింది. మహమ్మారిలా విజృంభిస్తుంటే ఇంతకన్నా ఏం చేయగలం. ముందు ఈ అంటువ్యాధి నుంచి రక్షించుకుంటే తరవాత వైద్యం గురించి ఆలోచన చేయవచ్చు. ఏ దేశమైనా తన పౌరులను రక్షించుకొనేందుకు ఇంతకంటే చేయగలిగేదేమీ లేదు.

చైనాలో అదుపులోకి వస్తున్న కరోనా

గట్టి చర్యలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్న డ్రాగన్

పర్వతారోహకులకు నో చెప్పిన నేపాల్

బీజింగ్,మార్చి14(ఆర్ఎన్ఎ): కరోనాను మట్టుపెట్టడంతో చైనా విజయం సాధిస్తోంది. దృఢచిత్తంతో పాటు..పక్కా నిరోధక చర్యలు తీసుకోవడంతో చైనాలో కొత్త కేసుల నమోదు వేగంగా పడిపోతున్నది. 80వేలమంది రోగుల్లో 60వేలమంది, అంటే దాదాపు డెబ్బయ్‌శాతం రోగం బారినుంచి బయటపడ్డారని సమాచారం. అలాగే మిగతా దేశాల్లో కూడా దాదాపు యాభైశాతం ఆరోగ్యవంతులైనారు. కరోనా వ్యాప్తి ఎంత భయపెడుతున్నప్పటికీ, కోలుకుంటున్నవారి సంఖ్య కూడా అదేరీతిలో పెరుగుతన్నది. దీంతో కరోనా బాధితుల్లో మాత్రం ధైర్యం చిక్కుతుంది. మిగతా ప్రపంచమంతా బాధితుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో చైనాలో మాత్రం కట్టడి చేయగలుగుతోంది. ఈ లెక్కన కరోనా కేసుల్లో కనీసం ఎనభైశాతానికి ఏ ముప్పూ రాబోదనీ, వైరల్ లోడ్ అధికంగా ఉన్నవారికి, అందునా వృద్ధులకు మాత్రమే సమస్య ఉండవచ్చునని ఎప్పటినుంచో చెబుతున్నదే. రోగానికి భయపడటం కంటే జాగ్రత్త పడటం ముఖ్యమని హెచ్చరిస్తున్నారు. భారత సంస్కారానికి ప్రతీకగా ఉన్న నమస్కారం ఇప్పుడు ప్రపంచదేశాధినేతలందరికీ ఉపకరిస్తున్నది. ప్రిన్స్‌చార్ల్స్ కూడా కరచాలనానికి స్వస్తిపలికారు. అలాగే అనేక దేశాధినేతలు నమస్కారం అలవర్చుకున్నారు. కరచాలనం పక్కన పెట్టారు. ఈ దశలో రోగలక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, సామూహిక బాధ్యతలను తెలియచెప్పడం నిరంతరం జరుగుతూండవలసిందే అని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. దానితో పాటు అసత్యప్రచారాలకు, గాలివార్తలకు కత్తెరవేయగలగాలి. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాలను అడ్డుకోవాలి. భారత్‌లో కూడా కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఇప్పటికప్పుడు పరిస్థితి చేజారిందని చెప్పలేం. అయితే జాగ్రత్తలు మాత్రం తీసుకోవాల్సిందే. ఎంతటి విపత్తుకైనా సిద్ధపడి పరీక్షాకేంద్రాలు, ఆసుపత్రులను సిద్ధం చేసుకోవాల్సిందే. కరోనాను ఎదుర్కొంటున్న ప్రతీ దేశమూ తన అనుభవాన్ని మనకు అందిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం కేసులు 1,33,970కి చేరుకున్నాయి. ఆయా దేశాల ప్రభుత్వాలు నివారణ చర్యలు వేగవంతం చేశాయి. అత్యధికంగా చైనాలో మరణాలు సంభవించగా ఆ తర్వాత ఇటలీ, ఇరాన్ వరుసలో ఉన్నాయి. చైనా వెలుపల దేశాల్లో మొత్తం 53,163 కేసులు నమోదయ్యాయి. 1,782 మంది ప్రాణాలు కోల్పోయారు. కేసుల సంఖ్య, మరణాల్లో ఇటలీ రెండో స్థానంలో ఉండగా, ఇరాన్ మూడో స్థానంలో ఉన్నాయి. ప్రపంచాన్నే భయాందోళనకు గురిచేస్తున్న కరోనా వల్ల సంస్థలు మూతపడుతున్నాయి. పలు టోర్నీలు, కార్యక్రమాలు రద్దయ్యాయి. తాజాగా కొవిడ్-19 ప్రభావం పర్వతాంతాలపైనా పడింది. కరోనా వైరస్ వ్యాప్తిపై భయాందోళనలు అధికమైన వేళ ఎవరెస్ట్ శిఖరం అధిరోహణ కోసం పర్వతారోహకులకు అనుమతులను నిలిపివేసింది నేపాల్. ఇప్పటికే టిబెట్ నుంచి శిఖరాన్ని అధిరోహించేందుకు ఉన్న మార్గాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది చైనా. తాజాగా నేపాల్ కూడా ఎవరెస్ట్ ?తో పాటు తమ దేశంలో ఉన్న అన్ని పర్వతాల అధిరోహణకు అనుమతులతోపాటు పర్యటక వీసాలను కూడా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. కరోనా మరణ మృదంగం కొనసాగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా కాటుకు5,416మంది బలికాగా బాధితుల సంఖ్య 145, 361కు చేరింది. చైనాలో 3,177మంది చనిపోతే..80,824మంది చికిత్స పొందుతున్నారు. ఇటలీలో 1266మంది మృత్యువాత పడితే 17,660మంది చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఇరాన్ 514మంది మరణిస్తే.. 11, 364మంది చికిత్స పొందుతున్నారు. స్పెయిన్ లో 133మందిని కరోనా కాటేస్తే బాధితుల సంఖ్య 5,232కు చేరింది. ఫ్రాన్స్‌లో 79మంది మృతి చెందగా 3,661మంది చికిత్స పొందుతున్నారు. అమెరికాలో 48మంది చనిపోగా, రోగుల సంఖ్య 2100కు పెరిగింది. ఆస్ట్రేలియా హోంశాఖమంత్రి ఈ మహమ్మారి బారిన పడ్డారు. ఇక కరోనాను కట్టడి చేసేందుకు అమెరికా, పాకిస్థాన్, గ్రీస్,ఇటలీ, సౌత్ కొరియా, జర్మనీ, కెనడా, పాకిస్థాన్, సౌదీ దేశాలు కీలక చర్యలు తీసుకుంటుంటే..ఇరాన్ మరో సంచలన నిర్ణయంతో వార్తల్లోకెక్కింది.ఇరాన్ వీధులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. దేశంలో ప్రతీ పౌరుడికి కరోనా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇక కరోనా వ్యాప్తి దృష్ట్యా కెనడా పార్లమెంట్ ఎప్రిల్ 20వరకు వాయిదా పడింది

కార్పొరేట్ ఆస్పత్రులకూ కరోనా ఎఫెక్ట్

అత్యవసరం అయితే తప్ప రాని రోగులు

మాల్స్,హోటళ్లకు తగ్గిన ప్రజలు

కరోనా భయమే కారణమంటున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): కరోనా ఎఫెక్ట్ నేపథ్యంలో రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో మాల్స్.. సినిమా హాళ్లు, ఫుడ్‌కోర్టులకు గిరాకీ అమాంతం పడిపోయింది. అయితే ఇదంతా ఒక ఎత్తయితే చిన్నాచితక వ్యాధులకు వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలివచ్చే రోగుల సంఖ్య భారీగా పడిపోయింది. ప్రధాన ఆసుపత్రులు ఎప్పుడూ కిటకిటలాడేవి. అలాంటిది కరోనా భయంతో మామూలు వైద్యం కోసం వచ్చే వారు రావడం లేదు. దీంతో కార్పొరేట్ ఆస్పత్రులు ఖాళీగా కనిపిస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య తగ్గింది. కరోనా భయంతో మామూలు నర్సింగ్‌హోమ్‌లకు కూడా ప్రజలు రావడానికి జంకుతున్నారని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ధనుంజయ్ అన్నారు. అత్యసవర చికిత్సలకు మాత్రమే ప్రజలు వస్తున్నారని అన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు కూడా చికిత్స కోసం వచ్చే వారు తగ్గారని అన్నారు. కరోనా కారణంగా గ్రామాల నుంచి వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని నగరంలోని మ్యాక్స్ క్రోర్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ తిరుమల హరి చెప్పారు. ఆపరేషన్లు తప్పవని అనుకున్న కేసులకు సంబంధించిన వారు మాత్రమే వస్తున్నారని అన్నారు. కరోనా కారణంగా దగ్గు జలుబు లాంటి వ్యాధులు ఉంటేనే ప్రజలు డాక్టర్లను సంప్రదిస్తున్నారని నగరంలోని ప్రముఖ ఫిజిషయన్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి చెప్పారు. అత్పవసరం అయితే తప్ప రోగులు కూడా తగ్గారని అన్నారు. ఇదంతా కరో భయం వల్లనే అని అన్నారు. ఇకపోతే కొద్దిరోజుల ుగా కరోనా వైరస్‌భయంతో అన్ని రకాల వ్యాపారాలు పడిపోయాయి. షాపింగ్ మాల్స్, సినిమా హాళ్లు, వినోదం పం

హనీమూన్ దంపతులకు కరోనా

ఆగ్రాలో ఐసోలేషన్ వార్డులో కుటుంబం

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): హనీమూన్ కోసం ఇటలీ దేశానికి వెళ్లి వచ్చిన దంపతులకు కరోనా వైరస్ సోకిన ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రా నగరంలో కలవరం రేపింది. బెంగళూరు నగరంలోని గూగుల్ ఉద్యోగికి కరోనా వైరస్ సోకిందని శుక్రవారం జరిపిన పరీక్షల్లో తేలింది. దీంతో గూగుల్ ఉద్యోగిని బెంగళూరు నగరంలోని ఓ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

దీంతో గూగుల్ ఉద్యోగి భార్య బెంగళూరు నుంచి పారిపోయి న్యూఢిల్లీకి విమానంలో ప్రయాణించి తన స్వస్థలమైన ఆగ్రా నగరానికి తిరిగి వచ్చింది. కరోనా వైరస్ సోకిన గూగుల్ ఉద్యోగి దంపతులు హనీమూన్ కోసం ఇటీవల ఇటలీ దేశంలో పర్యటించి వచ్చారని ఆగ్రా వైద్యాధికారుల పరిశీలనలో వెల్లడైంది.

బెంగళూరు టెకీ భార్య ఆగ్రాకు రావడంతో ఆగ్రా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముకేష్ కుమార్ నేతృత్వంలోని వైద్యాధికారుల బృందం టెకీ భార్య ఇంటికి వచ్చింది. టెకీ భార్య తండ్రి రైల్వేలో ఇంజినీరు. టెకీ భార్యతో పాటు ఆమె కుటుంబసభ్యులు ముందు వైద్యపరీక్ష చేయించుకునేందుకు నిరాకరించారు. దీంతో జిల్లా కలెక్టరు, పోలీసుల జోక్యంతో టెకీ భార్య పరీక్షకు అంగీకరించింది. వైద్యాధికారులు జరిపిన పరీక్షలో బెంగళూరు గూగుల్ ఉద్యోగి భార్యకు కూడా కరోనా వైరస్ సోకిందని తేలడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. గూగుల్ ఉద్యోగి భార్య కుటుంబసభ్యులు 9 మందిని కూడా ఆగ్రాలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి, వారిని కూడా ఐసోలేషన్ లో ఉంచి వైద్యపరీక్షలు చేస్తున్నామని ఆగ్రా వైద్యులు చెప్పారు.

సంగారెడ్డి సమీపంలో బస్సు దగ్ధం

ప్రయాణికులు సురక్షితం

సంగారెడ్డి,మార్చి14(నేటినిజం ప్రతినిది): జిల్లాలోని రామచంద్రాపురం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం సాయంత్రం ముంబై నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఈ బస్సు రామచంద్రాపురం సమీపానికి రాగానే ప్రమాదానికి గురైంది. బస్సులో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు క్షణాల్లో బస్సు మొత్తాన్నీ వ్యాపించాయి. ప్రమాద సమయంలో బస్సులో 26 మంది ప్రయాణికులు ఉన్నారు. తొలుత ఇంజిన్ నుంచి దట్టమైన పొగ బయటికి రావడంతో డ్రైవర్ అప్రమత్తం అయ్యాడు. వెంటనే ప్రయాణికులను కిందికి దించేశాడు. ఆ వెంటనే భగ్గుమంటూ మంటలు చెలరేగాయి. చూస్తుండగానే బస్సు మొత్తం వ్యాపించాయి. ప్రయాణికులు తమ లగేజీని కిందికి దించుకోవడానికి కూడా సమయం లభించలేదంటే.. అగ్నికీలలు ఎంత వేగంగా వ్యాపించాయో అర్థం చేసుకోవచ్చు. ప్రయాణికులు కట్టుబట్టలతో నడిరోడ్డు మీద నిల్చుండిపోయారు. జాతీయ రహదారిపై పెట్రోలు బంకు ఎదురుగానే ఈ భారీ అగ్నిప్రమాదం సంభవించడం ఉలిక్కి పడేలా చేసింది.అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే లోపే బస్సు మొత్తం దగ్ధమైంది. సమాచారం అందుకున్న రామచంద్రాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది పిలిపించారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుని ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ముంబైలో బయలుదేరిన బస్సు ఎక్కడా ఆగకుండా ప్రయాణించడం వల్ల ఇంజిన్ వేడెక్కి ప్రమాదానికి దాసి ఉండొచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిగ్ బ్రీడింగ్ పాలసీ చేపట్టండి

వినోద్‌కు కెనడా ప్రతినిధుల ప్రతిపాదన

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించేలా చర్యలు తీసుకోవాలని కెనడా సోలార్ జెనెటిక్స్ అధ్యక్షుడు అల్ఫ్రెడ్ వాల్, తెలంగాణ రాష్ట్ర సౌజన్య పార్టీ అధినేత సాగర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్‌క్వార్టర్స్‌లో వినోద్‌కుమార్‌ను కలిసిన ప్రత్యేక బృందం వినతి పత్రాన్ని అందజేసింది. రాష్ట్ర పిగ్ బ్రీడింగ్ పాలసీ ఖరారు అయితే లైవ్ పిగ్స్, వాటి వీర్యాన్ని కెనడా నుంచి దిగుమతి చేసుకునేందుకు, పిగ్ మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేసేందుకు వాణిజ్యపరమైన లైసెన్స్ కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుందని ఆల్ఫ్రెడ్ చెప్పారు. పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం పై ఎలాంటి ఆర్థిక భారం పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిగ్ బ్రీడింగ్ పాలసీని ఖరారు చేసి కేంద్రానికి పంపేలా చర్యలు తీసుకోవాలని కెనడా తెలంగాణ ప్రతినిధులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను కోరారు. పిగ్ ఫార్మింగ్ కోసం తెలంగాణ ఎంతో అనువైన ప్రాంతమని, తెలంగాణలో వాతావరణం సమశీతోష్ణ స్థితి కలిఇ ఉందని ఆల్ఫ్రెడ్ వివరించారు. పిగ్‌ఫార్మింగ్ ద్వారా వాటి మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతుందని ఆయన తెలిపారు దీనిపై తక్షణమే స్పందించిన వినోద్‌కుమార్ పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారు. సత్వరమే పిగ్ బ్రీడింగ్ పాలసీని రూపొందించాలని వినోద్‌కుమార్ సూచించారు.

ప్రత్యేక రైల్వే బడ్జెట్ ఓ బెలూన్

-లోక్‌సభలో చర్చలో మంత్రి పీయూష్ గోయల్

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెట్టేదని ఇవాళ రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రైల్వే అంశంపై లోక్‌సభలో చర్చ జరిగిన తర్వాత మంత్రి కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ కేవలం బెలూన్ మాత్రమే అని, కేవలం చప్పట్ల కోసమే దానిని ప్రవేశపెట్టేవారని మంత్రి విమర్శించారు. ప్రభుత్వాలు చేసిన ఫేక్ ప్రకటనలు.. ప్రజలను తప్పుదోవ పట్టించాయన్నారు. 1974 నుంచి ప్రకటించిన పలు రైల్వే ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైల్వే అంశంపై లోక్‌సభలో సుమారు 11 గంటల పాటు చర్చ చేపట్టారు. 2013-14లో రైల్వే బ్జడెట్ కోసం 54 వేల కోట్లు కేటాయించామని, ఇప్పుడు ఆ బ్జడెట్‌ను 1.61 లక్షల కోట్లకు పెంచినట్లు చెప్పారు. పెంచిన బ్జడెట్‌ను 58 సూపర్ క్రిటికల్, 68 క్రిటికల్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే లైన్ విద్యుత్తీకరణ టా÷-గ్గం÷ట్‌ను చేరుకున్నామన్నారు. రైల్వే పెన్షన్ల విషయంలోనూ గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించినట్లు మంత్రి తెలిపారు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

సిసి కెమెరాల ఆధారంగా పట్టుకున్న పోలీసులు

వివరాలు వెల్లడించిన కరీంనగర్ పోలీసులు

కరీంనగర్,మార్చి14(నేటినిజం ప్రతినిది): పలు దొంగతనాల కేసులలో నిందితులైన అంతర్రాష్ట్ర దొంగలను కరీంనగర్ సిసిఎస్, వన్ టౌన్ పోలీసులు కలిసి చాకచక్యంగా పట్టుకున్నారని కరీంనగర్ అడిషనల్ డిసిపి చంద్రమోహన్ తెలిపారు.శుక్రవారం అయన మీడియా తో మాట్లాడుతూ ఇటీవల కరీంనగర్‌లో పట్టపగలే జరిగిన చోరీలో నిందితుడైన ఆనంద్ కుమార్‌ను పోలీస్‌లు అరెస్ట్ చేశారని తెలిపారు. ఆనంద్ రిటైర్డ్ ఉద్యోగి బూర్ల ఆత్మారాం ఇంట్లో పట్టపగలే దొంగతనం చేసి పారిపోగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల్ని గుర్తుపట్టి క్లూస్ టీం ,సైబర్ పోరెన్సిక్ నిపుణుల సహకారంతో నిందితున్నీ పట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు 28 దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినా కూడా ప్రవర్తనలో మార్పు రాలేదని, మళ్లీ దొంగతనాలు వృత్తిగా చేస్తున్నాడని ఇతని పై పిడి ఆక్ట్ పెడుతామని తెలిపారు. మరో కేసులో మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు.వీరు 80 కేసుల్లో నిందితులని, వారిలో ఇద్దరు బావ బామ్మర్దులు కూడా ఉన్నారని నేరం చేయడమే ఒక వృత్తిగా భావించి అదేపనిగా ఆటోలు కార్లు అమాయక ప్రజలు ప్రయాణికులను బెదిరించి బంగారం నగదు తీసుకుని పారిపోతున్నారని అయన తెలిపారు. డిసెంబర్ 25న కరీంనగర్ లోని కాశ్మీర్ గడ్డలో ఆడేపు సందీప్ అనే వ్యక్తి తన ఆటో కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో ఈ కేసుకు సంబంధించిన సీసీ కెమెరాలు ఆధారంగా సిసిఎస్ పోలీసులు నిందితులను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. వారిలో ప్రధాన నిందితుడు సయ్యద్ యూసఫ్ మహమ్మద్ బషీర్ ఖాన్ దుర్గా హుస్సేన్ షా వాలి వీరంతా రాజేంద్రనగర్ రంగారెడ్డి సైబరాబాద్ ని వాసులని వీరిని అరెస్టు చేసి రికవరీ చేశామని త్వరలో మొత్తం రికవరీ చేస్తామని అన్నారు.ఈ సమావేశం లో సీసీఎస్ ఏసిపి శ్రీనివాస్ సి ఐ దేవారెడ్డి ఎస్సైలు అశోక్ రెడ్డి తదితరులు ఉండగా నిందితుల అరెస్ట్ కు సహక రించిన పోలీస్ లకు రివార్డ్ లు అందచేస్తామని చంద్రమోహన్ తెలిపారు.

తండ్రికి తగ్గ తనయురాలు..కల్వకుంట్ల కవిత

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను టీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ సౌతాఫ్రికా శాఖ నిర్వహించిన దృశ్యం

హైదరాబాద్, మార్చి 14:తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను టీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ సౌతాఫ్రికా శాఖ అంగరంగవైభవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సభ్యులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ శాఖ అధ్యక్షులు గుర్రాల నాగరాజు మాట్లాడుతూ.. తండ్రికి తగ్గ తనయురాలు కవిత అని కొనియాడారు. చెరగని చిరునవ్వు, ఆత్మవిశ్వాసం, మాట ఇస్తే తప్పని నైజం ఆమె సొంతమన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా ఎంపీగా ఎన్నికైన కవిత.. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు సైతం సొంతం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ జాగృతి ఏర్పాటుచేసి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తెలంగాణ మలిదశ ఉద్యమంలో మహిళా నేతగా కీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కవితదని నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సౌతాఫ్రికా శాఖను పటిష్టపరచడంలో కీలకపాత్ర వహిస్తున్న జ్యోతిరెడ్డి వాసిరెడ్డి, కట్టా శిరీషలను శాఖ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ శాఖ ఉపాధ్యక్షులు నన్నూరి మల్లికార్జున్ రెడ్డి, కొశాధికారి హరీష్ రంగా, మీడియా ఇంచార్జీ కిరణ్ కుమార్ బెల్లి, ఉమ్మడి కార్యదర్శులు జ్యోతిరెడ్డి వాసిరెడ్డి, రమణా రెడ్డి కంకణాల, కార్యనిర్వాహకులు సౌజన్ రావు, సాయికిరణ్, అనిల్ రెడ్డి గుడిపాటి, చక్రపాణి, వెల్ఫేర్ ఇంచార్జి శివా రెడ్డి, పీఆర్ఓ రాంబాబు తొడుపునూరి, కల్చరల్ ఇంచార్జి నవదీప్ రెడ్డి, చారిటీ ఇంచార్జులు శ్రీధర్ రెడ్డి, అరవింద్, మెంబర్‌షిప్ ఇంచార్జులు నామా రాజేష్, సందీప్ ముషిపట్ల, కోర్ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రేపల, శిరీష కట్టా, రంజిత్ పాల్గొన్నారు.

కరోనా ముందు జాగ్రత్తలే మేలు

అభిమానులకు కోహ్లీ పిలుపు

ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మ్యాచ్‌లూ రద్దు

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ తన అభిమానులకు జాగ్రత్తలు చెప్పాడు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, వైరస్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపాడు. కరోనా వచ్చిన తర్వాత ఇబ్బంది పడటం కంటే. ముందుగానే నివారణ చర్యలు తీసుకుంటే మేలని అన్నాడు. బలంగా ఉండండి ..పోరాడండని పిలుపునిచ్చాడు. కరోనాపై అందరం కలసికట్టుగా పోరాడుదామని చెప్పాడు. మరోవైపు, కరోనా ప్రభావంతో పలు టోర్నీలు రద్దవుతున్న సంగతి తెలిసిందే. ఇండియాదక్షిణాఫ్రికాల మధ్య జరగాల్సి వన్డే మ్యాచ్ లు కూడా రద్దయ్యాయి. ఐపీఎల్ వాయిదా పడింది. జపాన్ లో ఒలింపిక్స్ జరగడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కోహ్లీ తన అభిమానులకు ట్విట్టర్ ద్వారా జాగ్రత్తలు చెప్పాడు. ఇదిలావుంటే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న చాపల్-హ్యాడ్లీ వన్డే, టీ20 సిరీస్‌లకు కష్టకాలం వచ్చింది. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. ఆ రెండు సిరీస్‌లను రద్దు చేయాలని భావించారు. రెండు దేశాల మధ్య తొలి వన్డే జరిగినా.. మిగితా రెండు వన్డేలను రద్దు చేసినట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్ ప్రభుత్వం ఆంక్షలు విధించిన నేపథ్యంలో..ఆ దేశ జట్టు స్వదేశానికి వెళ్లనున్నది. బోర్డర్ ఆజ్ఞలు విధించడం వల్ల కివీస్ జట్టు స్వదేశానికి పయనం కానున్నది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది.న్యూజిలాండ్ దేశం 14 రోజుల ఐసోలేషన్ పెట్టుకోవడం వల్ల క్రికెటర్లు స్వదేశం వెళ్తున్నట్లు తెలుస్తోంది. సిడ్నీలో రెండు దేశాల మధ్య ప్రేక్షకుల లేకుండానే తొలి వన్డే నిర్వహించిన విషయం తెలిసిందే. వైరస్ సోకిన పేస్ బౌలర్ లాకీ ఫెర్గూసన్‌ను ఐసోలేట్ చేసినట్లు కివీస్ క్రికెట్ బోర్డు పేర్కొన్నది. ఇండియా, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌ను కూడా కరోనా భయాందోళనల నేపథ్యంలో రద్దు చేసిన విషయం తెలిసిందే.

విద్యుత్ ఛార్జీలు, ఇంటిపన్నుల మోత

గ్రామాలు, పట్టణాల్లో పెంపునకు రంగం సిద్ధం

అసెంబ్లీలో వెల్లడించిన సిఎం కెసిఆర్

అభివృద్ధి జరగాలంటే ఛార్జీలు తప్పవని ప్రకటన

పేదలపై భారం పడకుండ చూస్తామని హామీ

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): ఆస్తిపన్ను,విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచబోతున్నారు. ఈ విషయాన్ని సిఎం కెసిఆర్ స్వయంగా వెల్లడించారు. గ్రామాలు,పట్టణాలు అభివృద్ధి చెందాలంటే పన్నులు పెంచక తప్పదన్నారు. ప్రజలు తమ నిర్ణయాన్ని స్వాగతిస్తారని కూడా చెప్పారు. అయితే పేదలపై భారం పడకుండా చూస్తామిన అన్నారు. రాష్ట్రంలో గ్రామాలు, మున్సిపాలిటీలు మరింత అభివృద్ధి చెందాలంటే ఆస్తిపన్ను పెంచాల్సిన అవసరం ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. శాసనసభలో పల్లెప్రగతిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. ప్రజాప్రతినిధులకు విధులు, బాధ్యతలను స్పష్టంగా చెబుతూ చట్టం తెచ్చినట్లు తెలిపారు. విధులు, బాధ్యతలు, సక్రమంగా నిర్వహించకపోతే ప్రజాప్రతినిధులపై చర్యలు తప్పవన్నారు. గ్రామ పంచాయతీలకు ప్రతి నెలా తప్పకుండా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేల వేతనాలు నిలుపుదల చేసైనా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయిస్తామన్నారు. రాష్ట్రంలో 500 జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు 20 ఉన్నాయి.

ఈ గ్రామ పంచాయతీలకు కూడా ఐదేళ్లలో రూ. 40 లక్షలు వస్తాయన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో మంది దాతలు విరాళాలు ఇస్తున్నారు. వరంగల్ రూరల్ జిల్లా దమ్మన్నపేకు చెందిన కామిడి నర్సింహారెడ్డి రూ. 25 కోట్ల విరాళం ఇచ్చారని కొనియాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచుల పదవులు పోతాయన్నారు. గెలిచిన వాళ్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎం అన్నారు. విద్యుత్ సంస్థలు బతకాలంటే ఛార్జీలు పెంచక తప్పదని సీఎం అన్నారు.పేదలకు భారం లేకుండా విద్యుత్ ఛార్జీలు పెంచుతామన్నారు. పన్నులు చెల్లించే స్థోమత ఉన్నవారికే పన్ను పెంపు వర్తించేలా చూస్తామన్నారు. లే అవుట్‌ల అనుమతులు కలెక్టర్లకు తప్ప మరెవరికి లేదన్నారు. ఇంటి కొలతలు యజమానులే అందిస్తారన్నారు. ఇంటి యజమానులు అందించిన లెక్కల ప్రకారమే పన్నుల విధింపు ఉంటుందన్నారు. ప్రజలపై తమకు నమ్మకం ఉందన్నారు. వాళ్లు నిజాలు చెబుతారనే ఆ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. అసత్యపు లెక్కలు ఇచ్చిన వారికి 25 రెట్లు జరిమానా విధిస్తామన్నారు. మొక్కల ను పెంచే బాధ్యతను కూడా ప్రజాప్రతినిధులకు అప్పగించినట్లు తెలిపారు. ఓట్ల కోసం భయపడే పరిస్థితి తమలో లేదన్నారు. ప్రజలకు మాపై విశ్వాసం ఉండేలా పాలన అందిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.

చిన్న గ్రామ పంచాయతీలకూ రేషన్ షాపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాలకు ఐదేళ్లకు కలిపి రూ.40లక్షలు ఇస్తామని కేసీఆర్ వెల్లడించారు. కేంద్రం ఇచ్చే గ్రాంట్‌కు సమానంగా రూ.1,847కోట్లు తామే ఇస్తామని తెలిపారు. అవసరమైతే తాము పస్తు ఉంటాం కానీ...పంచాయతీలకు నిధులు మాత్రం ఆపేది లేదని సీఎం తేల్చిచెప్పారు. 500 కన్నా తక్కువ జనాభా ఉన్న గ్రామాలు 899 ఉన్నాయన్నారు. 106 జనాభా ఉన్న గ్రామానికి కూడా ట్రాక్టర్ కొనాలని నిర్ణయించామని చెప్పారు. గ్రామాలను మార్చుకోవాలన్న సంకల్పంతో చాలా మంది విరాళాలిచ్చారని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఊళ్లను మారుస్తున్నారని తెలిపారు. విరాళాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ధన్యవాదాలు తెలియజేశారు. వాళ్లు ఇచ్చిన డబ్బు కన్నా... స్ఫూర్తి చాలా గొప్పదని కొనియాడారు.

విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్నులను పెంచబోతున్నామని తెలిపారు. గ్రామాల్లో 100శాతం పన్నులు వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్లకే లేఅవుట్ అనుమతుల బాధ్యతలు ఇవ్వనున్నట్లు సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

వీసా సర్వీసులు నిలిపివేత

అమెరికా కాన్సులేట్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో అమెరికా కాన్సులేట్ కీలయ నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి వీసా సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఇమ్మిగ్రెంట్, నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి నిర్ణయం ప్రకటించేవరకు వీసా సర్వీసులు అందుబాటులో ఉండవని పేర్కొంది. వీసా అపాయింట్‌మెంట్లు రీషెడ్యూల్ చేసుకోవాలని సూచించింది. భారత్‌లోని అన్ని అమెరికన్ కాన్సులేట్లకు ఇది వర్తిస్తుందని పేర్కొంది. కాగా, కరోనా వ్యాప్తిని దృష్ట్యా అమెరికాలో శుక్రవారం నేషనల్ ఎమర్జెన్సీ విధించిన సంగతి తెలిసిందే.

కరోనా ప్రపంచ దేశాల్లో మరణమృదంగం మోగిస్తోంది. ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 5 వేలు దాటింది. కేసుల సంఖ్య 1.34 లక్షలకు చేరింది. కరోనా ప్రకంపనలు భారత్‌లో కూడా విస్తరిస్తున్నాయి. ఈ మహమ్మారి బారిన పడి ఇప్పటికే ఇద్దరు మృతి చెందారు. దీంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. వ్యాప్తిని నిరోధించే దిశగా చర్యలను ముమ్మరం చేశాయి. ముఖ్యంగా ఐటీ రాజధాని బెంగళూరు నగరం సహా కర్నాటక వ్యాప్తంగా వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. షాపింగ్ మాల్స్‌ను, సినిమా థియేటర్లను, పబ్‌లు, నైట్ క్లబ్‌లను తక్షణమే మూసేయాలని ఆదేశించారు.

ఉచితంగా కోళ్ల పంపిణీ

నిజామాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): చికెన్ అమ్మకాలపై కరోనా ఎఫెక్ట్ చూపించింది. చికెన్‌తో ఈ వ్యాధి వ్యాపిస్తుందన్న వదంతులతో జనం చికెన్ తినడం మానేస్తున్నారు. దీంతో కోళ్ల అమ్మకాలు తగ్గిపోయి, పౌల్ట్రీ పరిశ్రమ నష్టాలపాలవుతోంది. కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో పౌల్ట్రీ ఫామ్‌లలోనే కోళ్లు నిలిచిపోతున్నాయి. వాటిని పోషించలేక చాలామంది పౌల్ట్రీ యజమానులు ఫ్రీగానే ఇచ్చేస్తున్నారు. వైరస్‌ను అంతగా పట్టించుకోని కొందరు వాటిని తీసుకెళ్లి విందులు చేసుకుంటున్నారు. కరోనా భయం మారుమూల గ్రామాలకూ వ్యాపించింది. కోళ్లను కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామంలోని పౌల్ట్రీ నిర్వాహకుడు సిద్దిరాములు కోళ్లను గ్రామస్తులకు ఉచితంగా అందించారు.

సరిహద్దులను మూసేసిన భారత్

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నిర్ధారిత కేసుల సంఖ్య దేశంలో రోజురోజుకు పెరుగుతుండటంతో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కరోనాను అరికట్టేందుకు వైరస్ వ్యాప్తి చెందకుండా బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్ దేశాల సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టులను ఆదివారం నుంచి మూసివేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దేశ సరిహద్దుల్లో మొత్తం 37 ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టులు ఉన్నాయి.

వాటిలో 19 చెక్‌పోస్టులు శనివారం అర్ధరాత్రి వరకు మాత్రమే పనిచేయనున్నాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఇండియా-బంగ్లాదేశ్, ఇండియా-నేపాల్, ఇండియా-భూటాన్, ఇండియా-మయన్మార్ సరిహద్దుల్లోని చెక్‌పోస్టులు మూతపడనున్నాయి. వీటితో కరోనా భయంతో చికెన్ అమ్మకాలు పాటు నేపాల్, భూటాన్ దేశాల నుంచి తగ్గాయని, దీంతో చికెన్ సెంటర్ విదేశీయులు దేశంలోకి రాకుండా నిర్వాహకులు కోళ్లు కొనుగోలు చేయడం అడ్డుకోవాలని హోంశాఖ ఆదేశాలు జారీ లేదని ఆయన పేర్కొన్నారు. తమ పౌల్ట్రీలో చేసింది. ఇటలీ, ఇరాన్, చైనా, స్పెయిన్, రూ. 3.50 లక్షల విలువ చేసే కోళు ఫ్రాన్స్, జర్మనీ, కొరియా దేశాల్లో పర్యటించి న్నాయని, వాటిని గ్రామస్తులతోపాటు దేశానికి వచ్చే వారిని ఐసోలేషన్ వార్డులకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉచితంగా తరలించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో తగ్గిన ఇంజనీరింగ్ విద్యార్థులు

-అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి హరీష్ రావు

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): కేంద్రం నుంచి కోతలే తప్ప... నిధులు రావడం లేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర ఆదాయం పెంపు కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. బడ్జెట్ ప్రజలకు ఆశాజనకంగా ఉంటే... ప్రతిపక్షాలకు మాత్రం నిరాశగా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యార్థుల సంఖ్య తగ్గిందని చెప్పారు. ఇతర కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు తగ్గాయని వివరించారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధికి లోబడే అప్పులు తీసుకున్నట్లు వెల్లడించారు. పీఆర్సీపై అతి త్వరలో సీఎం నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. పాత జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో యూనివర్సిటీల్లో కూడా ఉద్యోగాల నియామకం చేపడ్తామని హరీశ్‌రావు తెలిపారు.

యోగా శిక్షణ కేంద్రంలో దారుణం

విదేశీ మహిళపై అటెండర్ అత్యాచారం

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): యోగా సెంటర్ లో 33 ఏళ్ల మహిళపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తపోవన్ ప్రాంతంలోని రిషికేశ్ నాథ్ యోగాశాలలో నెల రోజుల నుంచి అమెరికాకు చెందిన మహిళ యోగా నేర్చుకుంటోంది. ఈ క్రమంలో రిషికేశ్ నాథ్ యోగాశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న నిందితుడు గితాన్స్ ఈ నెల 10వ తేదీన రాత్రి బాధితురాలికి ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేశాడు. అనంతరం బాధితురాలు మునికి రెటి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. దీంతో ఐపిసి సెక్షన్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు.

కరోనా అనుమానితి విద్యార్థికి ఎంజిఎంల

అద్దెదారుల వివరాలను ఉచితంగా అందజేస్తాం

కరీంనగర్, మార్చి 14:అద్దెదారులు పట్ల ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ డిసిపి (పరిపాలన) జి చంద్రమోహన్ అన్నారు. అద్దెకారులకు సంబంధించిన వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ లలో లేదా వాట్స్‌అప్, హాక్ ఐ యాప్ ల ద్వారా అందించినా ఉచితంగా వివరాలను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. శనివారం నాడు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకుంట గ్రామం శాంతినగర్ లో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుండి 7 30 గంటల వరకు ప్రతి అనుమానిత ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలను నిర్వహించారు.

అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (పరిపాలన)జి చంద్రమోహన్ మాట్లాడుతూ అద్దెదారుల వివరాలను దేశ రాజధాని ఢిల్లీ తర్వాత కరీంనగర్ కమిషనర్ లోనే అమలవుతోందని అన్నారు. తెలంగాణ వాసులు ఢిల్లీలో అద్దెకు వెళ్లినా అక్కడి పోలీసులు వారి వివరాల కోసం మన పోలీసు శాఖను అడుగుతున్నారని తెలిపారు.

చింతకుంట,శాంతినగర్ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందుతుందని చెప్పారు. నేరాలకు పాల్పడినట్లు అయితే విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించవని హెచ్చరించారు. వ్యసనాలకు బానిసలైన వారికి యువత దూరంగా ఉండాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్న ప్రతి పౌరుడు హాక్ ఐ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని చెప్పారు.ఈ యాప్ లో మహిళల భద్రత కోసం ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసిన తర్వాత 05 నిమిషాల నుండి 10 నిమిషాల వ్యవధిలో పోలీసులు సదరు స్థలానికి చేరుకుంటారని తెలిపారు.

మీట నొక్కితే చాలు పోలీస్ సేవలు అందుబాటులో ఉంటాయని విషయాన్ని గుర్తించాలని చెప్పారు. మహిళలు విద్యార్థినులపై ఏలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. చింతకుంట శాంతినగర్ ప్రాంతాలు శివారు ప్రాంతంలో ఉన్నందున ఇక్కడి ప్రజలు నూతన వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. నేరాల నియంత్రణ కోసం దోహదపడే సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాలనీ వాసులు 10 కెమెరాలను స్వచ్ఛందంగా అందజేసేందుకు ముందుకు వచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామ ప్రజలను అడిషనల్ డిసిపి చంద్రమోహన్ అభినందించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని వివిధ రకాల చెందిన 116 వాహనాలు, 03 వేల రూపాయల విలువ చేసే నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువ పత్రాలు లేని వాహనదారులపై కేసులను నమోదు చేయడంతో పాటు సదరు వాహనాలను సీజ్ చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ సారథి ఇన్స్పెక్టర్లు తుల శ్రీనివాసరావు, మహేష్ గౌడ్, రమేష్, సంతోష్ కుమార్, ఆర్ఐ లు మల్లేశం, జానిమియా, ఎస్సైలు ఎల్లయ్య గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు లతో పాటుగా వివిధ విభాగాలకు చెందిన 150 మంది పోలీసులు పాల్గొన్నారు.

ఎపిలోనూ కరోనా కలకలం

అధికారులకు సిఎం జగన్ సూచనలు

అనుమానితులకు తక్షణ పరీక్షలు

విజయవాడ,మార్చి14(ఆర్ఎన్ఎ): విజయవాడలో కరోనా కల్లోలం కొనసాగుతూనే ఉంది. ప్రాణాంతక వైరస్ పేరు వినగానే ప్రజలు వణికిపోతున్నారు. సాధారణ జలుబు చేసినా కరోనా అన్న భయంతో గడగడలాడి పోతున్నారు. ఈ క్రమంలో కొందరు స్వచ్ఛందంగా ఆస్పత్రులకు వెళ్తుంటే విదేశాల నుంచి వస్తున్నవారికి కరోనా అనుమానంతో అధికారులు స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా అప్రమత్తం అయ్యింది. అనుమానితులకు టెస్టులు చేయిస్తున్నారు. సిఎం జగన్ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు చేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రజలను అలజడికి గురిచేస్తున్నారు. ప్రతిరోజూ కరోనా అనుమానిత కేసుల గురించి ప్రసార మాధ్యమాల్లో వార్తలు వెలువడుతుండటంతో ప్రజలు మరింత భయపడిపోతున్నారు. అయితే జిల్లాలో ఎక్కడా కరోనా లక్షణాలు లేవని అధికారులు స్పష్టం చేస్తున్నా.. ఇటీవల ప్రతి రోజూ కరోనా వైరస్ జిల్లాలో ఏదో ఒక మూల ప్రకంపనలు పుట్టిస్తూనే ఉంది. తాజాగా మరో రెండు కరోనా అనుమానిత కేసులను వైద్యులు గుర్తించినట్లు ప్రసార మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. ఆ వార్తలు నిజం కాదని అధికారులు స్పష్టం చేశారు. ఢిల్లీకి చెందిన దుస్తులు అమ్ముకునే వ్యక్తి దగ్గు, జలుబుతో బాధపడుతూ విస్సన్నపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. అయితే అక్కడి వైద్యాధికారులు అతడిని నూజి వీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో అది కరోనా కేసేనంటూ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఆ రోగికి కరోనా లేదని, దగ్గు, జలుబు, ఆయాసంతోపాటు గుండె, కిడ్నీ సమస్యల తో బాధపడుతున్నాడని, అతిగా మద్యం సేవించడం వల్ల లివర్ సమస్యలు ఉన్నాయని నూజివీడు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్ తెలిపారు. అతడికి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశామని ఆయన తెలిపారు. ప్రస్తుతం అతడికి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగం లో వైద్యులు చికిత్స చేస్తున్నారు.

ఇలాంటి కేసే మరొకటి మచిలీపట్నంలోనూ వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఒక విద్యార్థి కరోనా లక్షణాలున్నట్లు ప్రచారం జరిగింది. అతడిని మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువస్తున్నట్లు సమాచారం అందడంతో జిల్లా ఆస్పత్రి అధికారులు అతడికి వైద్యసేవలందించేం దుకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. అయితే బాధితుడు ఒక డాక్టర్ అన్న కొడుకు కావడంతో అతడిని ఇంట్లోనే ఉంచి వైద్యం అందిస్తున్నట్లు సమాచారం. విజయవాడ నగరంలో మరో కరోనా కేసు ఉన్నట్లు ప్రచారం జరిగింది. గుణదలలోని పడవలరేవు సెంటరుకు చెందిన ఒక వ్యక్తి కరోనా లక్షణాలతో బాధపడుతున్నట్లు ప్రచారం జరిగింది. దీంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వైద్యాధికారులు అతడిని తీసుకువెళ్లి తగిన చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. గురువారం రాత్రి ఇండిగో విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న వ్యక్తికి కరోనా లక్షణాలున్నట్లు ఎయిర్ పోర్టులోని వైద్యాధికారులు గుర్తించడంతో అతడిని ప్రత్యేక అంబులెన్స్‌లో ఇంటికి తరలించిన సంగతి తెలిసిందే. విజయవాడకు చెందిన ఆ వ్యక్తి ఇటీవల జర్మనీ వెళ్లి అక్కడి నుంచి తిరిగి విమానాల్లో ఢిల్లీ, హైదరాబాదు విమానాశ్రయాల మీదుగా గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కృష్ణా జిల్లా వైద్యాధి కారులు అతడిని ఇంట్లోనే ఉంచి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.

అమెరికాలో కరోనా ఎమర్జెన్సీ

వైరస్ నియంత్రణకు 50 బిలియన్ డాలర్ల నిధి

నేడు నేషనల్ ప్రేయర్ డేగా

కీలక ప్రకటన చేసిన అధ్యక్షుడు ట్రంప్

న్యూయార్క్,మార్చి14(ఆర్ఎన్ఎ): నోవెల్ కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించింది. వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించారు. కరోనా నియంత్రణకు ఫెడరల్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుదన్నారు. నేషనల్ ఎమర్జెన్సీని అధికారికంగా ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైరస్ నియంత్రణకు 50 బిలియన్ డాలర్ల నిధిని కేటాయిస్తున్నట్లు చెప్పారు. రిలీఫ్ ప్యాకేజీ గురించి ఉభయసభల్లో ఓటింగ్ నిర్వహించనున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అన్ని అవరోధాలను అధిగమిస్తామన్నారు. ఎటువంటి వనరులను కూడా వదిలేది లేదన్నారు. తన ఆదేశాల మేరకు కార్నివాల్, రాయల్ కరేబియన్, నార్వేయన్, ఎంఎస్‌సీ లాంటి క్రూయిజ్‌లను 30 రోజుల పాటు నిలిపేసినట్లు ట్రంప్ తెలిపారు. అమెరికా ప్రజలు ఎక్కడ ఉన్నా.. విశ్వాసంతో అందరి క్షేమం కోసం ప్రార్థనలు చేయాలని కోరారు. వైరస్‌ను అతి సులువుగా ఎదుర్కోందమన్నారు. మార్చి 15వ తేదీన నేషనల్ ప్రేయర్ డేగా ప్రకటిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. విపత్కర సమయాల్లో దైవ రక్షణ కోసం కూడా ఎదురుచూసిన చరిత్ర అమెరికాకు ఉన్నదని ట్రంప్ అన్నారు. ఎమ్జ్గ్ంసీ సేవలు మరింత త్వరగా అందేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. మన దేశ ప్రజల స్ఫూర్తి, పట్టుదల బలమైనవని, ప్రస్తుతం ఉన్న విపత్తును ఓడిస్తామని, అమెరికాకు గడ్డు పరిస్థితులు ఎదురైన సమయంలో దేశం మరింత పురోగమించిందన్నారు.

అమెరికా ప్రజల ఆరోగ్యం విషయంలో తమ ప్రభుత్వం ముందు జాగ్రత్తతో ఉన్నదన్నారు. కరోనా వైరస్ రెస్పాన్స్ యాక్ట్‌ను ఉభయసభల్లో ప్రవేశపెట్టనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఆ బిల్లుకు మద్దతు ఇవ్వాలని ఆయన డెమోక్రాట్లు, రిపబ్లికన్లను కోరారు. ఈ బిల్లు ద్వారా ఉచితంగా కరోనా వైరస్ పరీక్షలు చేపట్టనున్నారు. కరోనా సోకిన ఉద్యోగులకు పెయిడ్ లీవ్ ఇవ్వనున్నారు. కరోనాపై ట్రంప్ యుద్ధం ప్రకటించడంతో.. వాల్‌స్ట్రీట్‌లో మార్కెట్ షేర్లు దూసుకువెళ్లాయి. అమెరికా కరోనా సోకిన వారి సంఖ్య 2100కి చేరుకున్నది. 48 మంది మరణించారు.

నిట్ విద్యార్థికి కరోనా నెగెటివ్

-ఎంజిఎం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

వరంగల్,మార్చి14(ఆర్ఎన్ఎ): ఎంజీఎం ఐసోలేషన్ వార్డులో ఉన్న నిట్ విద్యార్థికి కరోనా నెగెటివ్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. అమెరికా వెళ్లొచ్చిన విద్యార్థి జ్వరం, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరాడు. వెంటనే అతడిని ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందించారు. విద్యార్థి శాంపిల్స్‌ను కరోనా టెస్ట్ కోసం పంపించగా నెగెటివ్ అని తేలింది. దీంతో వైద్యులు నిట్ విద్యార్థిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల అమలుపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సమీక్ష సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం త్వరలో 10 పడకలతో ప్రత్యేక ఐసీయూ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవడానికి సైతం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి యంత్ర పరికరాలు సైతం సమకూర్చడానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై డీఎంహెచ్‌వో నుంచి ఇద్దరు, ఎంజీఎం విభాగం నుంచి ముగ్గురు వైద్యులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారని, వారి ద్వారా ఎంజీఎం కొవిడ్-19 విభాగంలో విధులు నిర్వహించనున్న వైద్యులకు, సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆ విభాగంలో వైద్యసేవలు అందించడానికి వైద్యులు సైతం సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎంజీఎం నుంచి పంపిన నమూనాలను పరీక్షించి నిర్ధారించుకున్న తదుపరి అనుమానితుడిని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించాలని, లేనిపక్షంలో ఐసోలేటెడ్ వార్డులోనే ఉంచి వైద్యసేవలు అందించాలని అధికారులు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. అనుమానితులకు, ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడం, కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా అనుమానాలను, ఇబ్బందులను దూరం చేయాలని అధికారులు సూచించినట్లు తెలిపారు. నిట్‌లో కొవిడ్-19 ఎఫెక్ట్ స్పష్టంగా కనిపిస్తోంది. నిట్‌లోని హాస్టల్ కాంప్లెక్స్‌లు, మెస్‌ల విభాగాలు, ల్యాబ్‌ల్లో వైరస్ క్రిములను అడ్డుకునే రసాయనాలను స్ప్రే చేశారు. రిజిస్ట్రార్ ఎస్ గోవర్ధన్‌రావు ఆదేశాల మేరకు అన్ని విభాగాల డీన్‌లు, హాస్టల్ వా÷-డ్గ÷న్ క్లీనింగ్ పక్రియను వేగవంతం చేశారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ పమేలా సత్పతి, ఎంజీఎం వైద్యాధికారుల సహకారంతో విద్యార్థులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో క్లీనింగ్ పక్రియను చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు కొందరు విద్యార్థుల్లో కరోనాపై ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రార్ మాత్రం నిట్‌లో కొవిడ్ భయం ఏమీ లేదని, ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు గుంపులుగుంపులుగా ఉండి చేసే కార్యక్రమాలను వాయిదా వేసుకోవాలని నిట్ అధికారులు సూచించారు. తరగతులు మాత్రం యథావిధిగా సాగుతున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకుని విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారని అధికారులు తెలిపారు.

ఇన్ఫోసిస్ భవనం ఖాళీ

బెంగళూరు,మార్చి14(ఆర్ఎన్ఎ): బెంగుళూరులో ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్‌కు చెందిన ఓ బిల్డింగ్‌ను ఖాళీ చేయించారు. ఆ కంపెనీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి కరోనా సోకినట్లు తేలడంతో.. ఆ బిల్డింగ్‌లో పనిచేస్తున్న వారిని బయటకు పంపించారు. ముందస్తు చర్యగా ఐఐపీఎం బిల్డింగ్‌లో ఉన్నవారిని తరలిస్తున్నట్లు ఇన్ఫోసిస్ సంస్థ వెల్లడించింది. కర్నాటకలోని బెంగుళూరులో ఇన్ఫోసిస్‌కు భారీ క్యాంపస్ ఉన్నది. అక్కడ డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు ఉన్నాయి. డెవలప్‌మెంట్ సెంటర్లు, కార్పొరేట్ హౌజ్‌లు ఉన్నాయి. అయితే ఉద్యోగుల భద్రతా దృష్ట్యా.. బిల్డింగ్‌ను శానిటైజ్ చేస్తున్నట్లు డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ గురురాజ్ దేశ్‌పాండే తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే దుష్ప్రచారాలకు దూరంగా ఉండాలన్నారు.

నిర్మాతల మండలి అత్యవసర భేటీ

హైదరాబాద్,మార్చి14(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ వలన ఇప్పటికే పలు రాష్ట్రాలలో సినిమా థియేటర్స్ మూతపడ్డ సంగతి తెలిసిందే. ఇప్పుడు మన తెలుగు రాష్ట్రాలలోను థియేటర్స్ మూసివేతపై ఓ నిర్ణయానికి వచ్చేందుకు నిర్మాత మండలి ఫిలిం ఛాంబర్‌లో సమావేశమైంది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన చేస్తామని నిర్మాత మండలి చెబుతుంది. ఇప్పటికే నెల్లూరు, కేరళ, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, రాజస్థాన్ తదితర ప్రాంతాలలో థియేటర్స్ తాత్కాలికంగా మూతపడ్డాయి. అయితే నిర్మాత మండలి నిర్ణయాన్ని బట్టి మార్చి 25న విడుదల కావలసి ఉన్న వి చిత్రం, ఒరేయ్ బుజ్జిగా, 30 రోజుల్లో ప్రేమించడం ఎలా, లవ్ పాజిటివ్,శక్తి చిత్రాలని రిలీజ్ చేయాలా లేదంటే కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలా అని నిర్మాతలు ఆలోచన చేస్తున్నారు.

విజయనగరంలో విషాదం..ప్రమాదంలో యువకుడు మృతి

విజయనగరం,మార్చి14(ఆర్ఎన్ఎ): విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం గిజబ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఎద్ద బండిని వేగంగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మోహన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పేలుడుతో ప్రజల ఆందోళన

రంగారెడ్డి,మార్చి14(ఆర్ఎన్ఎ): రాజేంద్రనగర్ శివరాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి పలు ఇండ్ల కిటికీల అద్దాలు పగిలాయి. పేలుడు జరిగిన ప్రాంతంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురైయ్యారు. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లాలో శనివారం ఉదయం వేగంగా వచ్చిన ట్రక్కు అదుపుతప్పి బొలెరో వాహనంపైకి దూసుకెళ్లి ప్రమాదానికి గురైన దృశ్యం

జైపూర్,మార్చి14(ఆర్ఎన్ఎ): రహదారులు నెత్తురోడుతున్నాయి. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లాలో శనివారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. బలోత్రా - ఫలోడి హైవేపై వేగంగా వచ్చిన ట్రక్కు అదుపుతప్పి బొలెరో వాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం నుజ్జునుజ్జు అయింది. క్రేన్ సాయంతో ట్రక్కును పక్కకు తీశారు పోలీసులు.

11మంది మృత్యువాత..పలువురికి గాయాలు

తమిళనాడులోని నామక్కల్‌లో ఇవాళ ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన విషయం విదితమే. నామక్కల్ వద్ద వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతులను బీహార్ వాసులుగా పోలీసులు గుర్తించారు. మహారాష్ట్ర రాజధాని ముంబయిలోనూ ఈ ఉదయం రోడ్డు ప్రమాదం సంభవించింది. వోర్లీ సమీపంలో కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, కారు నడుపుతున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ ముషారఫ్

నిర్మల్,మార్చి 14: జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో కలియదిరు గుతూ వార్డులను పరిశీలించారు. గర్భినీల కు, బాలింతలకు, పసి పిల్లలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్.. వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించారు. హెల్ప్‌డెస్క్ వద్ద డెలివరీ రిజస్టర్, గర్భినీ స్త్రీలు, వారిని ఆస్పత్రికి తీసుకువచ్చే ఆశావర్కర్ల వివరాలు సమోదు చేయడానికి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని కలెక్టర్.. వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి వచ్చిన మహిళలను ఆత్మీయంగా పలకరించిన కలెక్టర్.. అక్కడ అందుతున్న వైద్యసేవలను వారిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులతో మాట్లాడుతూ.. గర్భినీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో ప్రతినెలా 300 ప్రసవాలు జరగాలనీ.. ఆ విధంగా సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరి తకలు జారీ చేశారు. కాగా, అంతకు ముందు కలెక్టర్ ఫారూఖీ.. పట్టణంలోని ధర్మసాగర్ చెరువును సందర్శించారు. చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగిం చాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించా రు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు డాక్టర్ రజిని, మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలకృష్ణ, తహసీల్దార్ సుభాష్ చందర్, మున్సిపల్ డీఈ సంతోష్ కుమార్, కౌన్సిలర్ మహమ్మద్ సలీం తదితరులు ఉన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.

జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో 7 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, మార్చి 14:జూబ్లీహిల్స్‌లో కొలువుదీరిన టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మొదటి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 7 నుంచి 17వ తేదీ వరకు కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలకు చెందిన పోస్టర్‌ను టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి, తెలంగాణ లోకల్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గోవిందహరి, వైస్ చైర్మన్ కొండా రాఘవరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో లోకల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE XIIST ADDL CHIEF JUDGE. AT : SECUNDERABAD.
O.P.NO 45 of 2017.

Between;
A.Vamshi Mohan.
...Petitioner.

AND
P.Prakash & Others.
...Respondents.

TO. R1.
Sowjanya, W/O:Not Known,
Aged : Major, Occ : Business,
R/o: H.NO-3-27/5/6,
Teachers Colony,
East Maredpally,
Secunderabad.

Please take notice that the above petitioner have filed the above O.P. for compensation for the injuries sustained by him in R.T.A. against you and other Respondents. The above case is posted on **27-03-2020,** for your appearance at about 10-30 A.M before the above said court. Hence you are here by called upon to appear before the above said court on the above said time personally or through your counsel. If you are failed to appear the matter will be decided in your absence.

(By the order of the court)
Sri. K.Chandrashekar,
Advocate
Secunderabad.

వైకాపా దౌర్జాన్యాలపై చర్య తీసుకోండి

అమిత్‌షాకు ఫిర్యాదు చేసిన బిజెపి ఎంపిలు

న్యూఢిల్లీ,మార్చి14(ఆర్ఎన్ఎ): ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ అధికార వైకాపా దౌర్జన్యాలకు పాల్పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్ర భాజపా ఎంపీలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీలు జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేశ్, టీజీ వెంకటేశ్ ఆయన్ను కలిసి ఫిర్యాదు లేఖను అందజేశారు. నామినేషన్లు ఉపసం హరించుకోవాలంటూ ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను వైకాపా నేతలు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. అమిత్‌షాతో భేటీ అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. అధికారులు వైకాపాకు సహకరిస్తున్నారని జీవీఎల్ ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వైకాపా రంగులు తొలగించాలని హైకోర్టు ఆదేశించినా ఆ పక్రియ ఇంకా పూర్తి కాలేదన్నారు. పోలీసులు కూడా వైకాపాకు మద్దతుగా మాట్లాడుతూ నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భాజపా నేతలు నామినేషన్ వేసే చోట పోలీసులు అడ్డుకోవడంతో పాటు దాడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అందుకే కేంద్రహోంమంత్రిని కలిసి విజ్ఞప్తి చేశామని సీఎం రమేశ్ చెప్పారు. ఏపీ ప్రజలు సంతోషాన్ని మరిచిపోయి చాలా రోజులైందని మరో ఎంపీ టీజీ వెంకటేశ్ వ్యాఖ్యానించారు. వైకాపా ప్రభుత్వం చేస్తు?న్న తప్పులకు కోర్టు మొట్టికాయలు వేస్తూనే ఉందన్నారు. భాజపా, జనసేన నేతలను టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా దాడులు చేసి ఏం సాధించాలనుకుంటున్నారని వైకాపాను ఆయన ప్రశ్నించారు.

గూగుల్ ఉద్యోగికి కరోనా

బెంగళూరు,మార్చి14(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని కలవరపెడుతున్న కరోనా ఇటు భారత్ ను వణికిస్తోంది. తాజాగా బెంగళూరు గూగుల్ ఉద్యోగికి కరోనా సోకింది. ఈ విషయాన్ని దృవీకరించిన వ్యాధి లక్షణాలు బయటపడానికి ముందు కొన్ని గంటలు అతను ఆఫీసులో